Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 345 మేడ్చల్ మల్కాజ్‌గిరి 3 జనవరి 2024 బుధవారం పేజీలు : 4

### ఆధార్ కార్డు ద్వారా వేతనం బట్వాడా

చెన్నై : వంద రోజుల ఉపాధి హామీ పథకం కూలీలకు ఆధార్ కార్డు ద్వారా కూలి బట్వాడా చేసే ప్రక్రియ అమల్లోకి వచ్చింది. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద దేశవ్యాప్తంగా కోట్లాది మంది కార్మికులున్నారు. ఆధార్ అనుసంధానం చేసిన కార్మికులకు వేతనం నేరుగా అందించేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉపాధి పథకం కార్డుతో ఆధార్ అనుసంధానం చేసేందుకు గత ఏడాది ఐదు సార్లు అవకాశం కల్పించగా, ఈ గడువు ఆదివారంతో ముగిసింది. మూడేళ్లలో ఒకరోజైనా పనిచేసి ఉంటే వారు విధుల్లో ఉన్నట్లు పరిగణించబడతారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన ఈ ప్రక్రియ ప్రకారం నమోదు చేసిన 25.25 కోట్ల మంది కార్మికుల్లో 14.35కోట్ల మంది మాత్రమే అర్హులుగా గుర్తించారు. రాష్ట్రప్రభుత్వాలకు కేంద్రం పంపిన సర్క్యులర్‌లో... అర్హత ఉండి నమోదు చేయని వారిని మళ్లీ పథకంలో చేర్చాలని పేర్కొంది.

# మహిళలకు భారీ గుడ్ న్యూస్..

## మరో ప్రతిష్టాత్మక స్కీమ్ అమలుకు సర్కార్ సిద్ధం..!



## నెలాఖరుకల్లా రూ. 2500/- పథకం అమలు!!

హైదరాబాద్ : 'మహాలక్ష్మి' గ్యారెంటీలోని మరో హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ఈనెల చివర్లోగా అర్హులైన మహిళలకు రూ.2500 సాయం అందించే పథకాన్ని ప్రారంభించేందుకు రెడీ అవుతున్నది. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేలోపే దీనిని అమలు చేసి.. వారి ఓటు బ్యాంకును ఆకట్టుకోవచ్చని భావిస్తున్నది. మహిళలకు ఫ్రీ బస్ జర్నీ స్కీమ్‌తో ఇప్పటికే ప్రభుత్వానికి మంచి మైలేజ్ వచ్చింది. రాష్ట్రంలో సగానికిపైగా మహిళా ఓటర్లే ఉన్నందున రూ.2500 సాయం హామీ అమలు సైతం రాజకీయంగా కలిసొస్తుందన్నది కాంగ్రెస్ ఆలోచన. ఇదిలా ఉండగా ఈ స్కీమ్‌ను అమలు చేయడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎంత మంది మహిళలకు లబ్ధి కలుగుతుంది? ఖజానాపై ఎంత భారం పడుతుంది? మార్గదర్శకాలు ఎలా ఉండాలి? అర్హులను గుర్తించడం ఎలా.. ఇలాంటి అంశాలన్నింటిపై త్వరలో క్లారిటీ రానున్నది.

**ఆచరణతోనే విపక్షాలకు జవాబు :** ఆరు గ్యారెంటీలను వంద రోజుల వ్యవధిలో అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకున్నది. రెండు రోజుల్లోనే రెండు హామీలను అమలు చేయడంతో పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. గ్యారెంటీల అమలుపై విపక్షాలు విమర్శలు చేస్తున్నా వాటి ఉచ్చులో పడొద్దని స్పష్టంగా నిర్ణయించుకున్నది. రెచ్చగొట్టే వ్యాఖ్యలకు స్పందించకుండా నిర్దిష్ట గడువులోగా వాటిని గాడిలో పెట్టడంపైనే దృష్టి పెట్టింది.

జనవరి చివరికల్లా ప్రభుత్వం స్పష్టమైన విధాన నిర్ణయం తీసుకుని మహిళలకు రూ.2500 సాయం స్కీంను ప్రారంభించి అపోహలకు, అనుమానాలకు తావు లేకుండా చేయాలని భావిస్తున్నది. విపక్షాల విమర్శలకు ఆచరణతోనే జవాబు చెప్పాలని అనుకుంటున్నది.

**వయస్సు పరిమితి విధించే చాన్స్ :** రూ.2500 సాయానికి ఏయే అంశాలను ప్రామాణికంగా తీసుకోవాలన్నది త్వరలో ఖరారు కానున్నది. ప్రస్తుతం మహిళలు ఆసరా పింఛన్లను అందుకుంటున్నా.. అవి వృద్ధులకు (57 ఏండ్లకు పైబడిన) మాత్రమే అమలవుతున్నాయి.

అంతకంటే తక్కువ వయసు ఉన్న మహిళలకు పింఛన్ అందే అవకాశం లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో ఆ సెక్షన్‌ను ఈ కొత్త స్కీమ్ నుంచి మినహాయించే అవకాశాలున్నాయి. ఇందుకోసం నిర్దిష్టంగా వయసు పరిధిని ప్రభుత్వం ఫిక్స్ చేయనున్నది. ఆదాయంతో పాటు ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుంటుందా?.. గైడ్‌లైన్స్‌లో ఎలాంటి అర్హతలను ప్రభుత్వం ఖరారు చేస్తుంది? ఇందుకు అనుసరించాల్సిన విధానాలు తదితరాలపై త్వరలో క్లారిటీ రానున్నది.

**కాంగ్రెస్‌కు అనుకూలంగా మహిళా ఓటర్లు..? :** ఇప్పటికే ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రోగ్రామ్‌లో అభయహస్తం పేరుతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ఇందులో మహాలక్ష్మి స్కీమ్‌లో రూ.2500 సాయం పొందే అవకాశమూ ఉన్నది. ఈ నెల 6వ తేదీతో దరఖాస్తుల గడువు ముగుస్తున్నందున వాటిలోని వివరాలను పరిగణలోకి తీసుకుని తొలుత ఈ స్కీమ్‌నే గాడిన పెట్టేలా అధికారుల స్థాయిలో కసరత్తు మొదలైంది. ఆ దరఖాస్తుల స్క్రూటినీలో భాగంగా వెల్లడయ్యే అంశాలకు అనుగుణంగా మార్గదర్శకాలు, అర్హతలు తదితరాలు రూపొందనున్నాయి. వాటి ప్రకారం ఈ స్కీమ్‌ను లాంఛనంగా ప్రభుత్వం ప్రారంభించనున్నది. లోక్‌సభ ఎన్నికల్లో మహిళా ఓటు బ్యాంకు అనుకూలంగా మారుతుందన్నది కాంగ్రెస్ భావన.

# కాంగ్రెస్‌కు రాజ్యసభ సీటివ్వనున్న బీఆర్ఎస్!

హైదరాబాద్ : తెలంగాణలో శాసనసభ ఎన్నికలు ముగిశాయి.. మరో ఐదు నెలల్లో లోక్ సభ ఎన్నికలూ రానున్నాయి.. వీటి మధ్యలోనే రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్‌లో మూడు రాజ్య సభ సీట్లు ఖాళీ కానున్నాయి.

మాజీ సీఎం కేసీఆర్ బంధువైన జోగినపల్లి సంతోష్ కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్రల పదవీ కాలం ఏప్రిల్ 2తో ముగియనుంది. వీటికి ఎన్నికలను మార్చిలోనే నిర్వహించనున్నారు.

**39.6 మంది ఎమ్మెల్యేలకు ఒకరు :** తెలంగాణలో 119 మంది ఎమ్మెల్యేలున్నారు. రాజ్యసభ సభ్యుల ఎన్నికలో వీరంతా ఓటింగులో పాల్గొంటారు. ప్రతి 39.6 సభ్యులకొకరు చొప్పున ముగ్గురు రాజ్యసభ సభ్యులను ఎన్నుకోవాలి. ప్రస్తుతం ఈ పూర్తి కోటాతో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు గానీ, మూడు గానీ సీట్లు గెలిచే అవకాశం లేదు. రాజ్యసభ బరిలో అభ్యర్థిని దింపడానికి 10 మంది శాసనసభ్యులు ప్రతిపాదించాలి. కాంగ్రెస్, బీఆర్ఎస్ కు మాత్రమే అసెంబ్లీలో పదిమందిపైగా ఎమ్మెల్యేలున్నారు. ఇక ఈ రెండింటికి కూడా మిత్రపక్షాలతో కలిపి ఒక సీటుకు సరిపడా మాత్రమే ఓట్లున్నాయి. 64 మంది ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ కు సీపీఐ మద్దతు పలుకుతుంది. బీఆర్ఎస్ కు 39, బీజేపీకి 8, మజ్లిస్‌కు ఏడుగురు ఎమ్మెల్యేలున్నారు.




**ఒకటి పక్కా.. రెండోది పోటీ..** ఓట్ల ప్రకారం.. కాంగ్రెస్ ఒక సీటును గెలుచుకుంటుంది. సీపీఐతో కలిపి 25 ఓట్లు మిగులుతాయి. రెండో అభ్యర్థి గెలుపునకు 15 సీట్లు తక్కువ పడతాయి. బీఆర్ ఎస్ కు ఒక అభ్యర్థి గెలుపునకు అవసరమైన 39.6 ఓట్లు లేవు. అయితే, 39 ఓట్లున్నందున మిత్రపక్షమైన మజ్లిస్ మద్దతుగా నిలిస్తే 46 ఓట్లు అవుతాయి. ఒక సీటు గెలిచాన ఆరు ఓట్లు మిగిలినా రెండో స్థానంలో పోటీ చేసి గెలిచే పరిస్థితి లేదు. అయితే, మూడు స్థానాలకు ముగ్గురే అభ్యర్థులు బరిలో నిలిస్తే.. పోలింగ్, సంఖ్యా బలంతో సంబంధం లేకుండా ఎన్నిక ఏకగ్రీవమవుతుంది. ముగ్గురికి మించి అభ్యర్థులు బరిలో ఉంటే.. మొదటి మూడు స్థానాల్లో అత్యధిక ఓట్లు వచ్చిన అభ్యర్థులను విజేతలుగా ప్రకటిస్తారు. ఒక స్థానం గెలిచే ఓట్ల కంటే 25 ఓట్లు ఎక్కువ ఉన్నందున కాంగ్రెస్ రెండు స్థానాలకు పోటీ చేసే వీలుంది. బీఆర్ఎస్, మజ్లిస్ కు ఒకటి గెలవగా.. ఆరు ఓట్లే ఉంటాయి. పదిమంది ప్రతిపాదన నిబంధనకు తగిన బలం లేదు. దీంతో రెండోస్థానానికి పోటీ చేసే వీలు ఉండదు. ఈ లెక్కన కాంగ్రెస్ రెండు, బీఆర్ఎస్ ఒక సీటు దక్కించుకుంటాయి. అయితే, ఇలా కాదని కాంగ్రెస్ మూడు, బీఆర్ఎస్ రెండు స్థానాలకు పోటీ చేస్తే పరిస్థితి ఉత్కంఠగా మారుతుంది.

కాంగ్రెస్ కు ముగ్గురు అభ్యర్థులు ఉంటే ఒక్కొక్కరి ఓట్ల బలం 21.6 అవుతుంది. కాంగ్రెస్ ఇలా చేస్తే బీఆర్ఎస్, మజ్లిస్ కలిసి పోటీ చేస్తుంది. అప్పుడు వాటి బలం 46 అవుతుంది. అంటే దానికి రెండు స్థానాల్లో 23 చొప్పున ఓట్లు ఉంటాయి. అది కాంగ్రెస్ అభ్యర్థుల సగటు ఓట్ల కంటే ఎక్కువ. కాబట్టి రెండు పార్టీలు తమ బలానికి తగ్గట్లు అభ్యర్థులను నిలిపి ఏకగ్రీవంగా గెలిపించుకోవడానికే మొగ్గు చూపే వీలుంది.

## కేసీఆర్‌ను కాంగ్రెస్ సర్కార్ కాపాడుతోంది : కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 2 : కాళేశ్వరం విషయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వంపై విచారణ కోరుతూ కేంద్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం లేఖ ఎందుకు రాయటం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్ లేఖ రాస్తే.. 48 గంటల్లో కేంద్రం సీబీఐ విచారణ చేపడుతోందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటి కాదంటే.. సీబీఐ విచారణ కోరాలన్నారు. న్యాయ విచారణ పేరుతో కేసీఆర్‌కు మేలు చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం



వ్యవహరిస్తోందని తెలంగాణ బీజేపీ చీఫ్ విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పూర్తిస్థాయి మెజారిటీ లేదని... అందుకే బీఆర్ఎస్‌తో అవగాహన కుదుర్చుకుందని ఆరోపించారు. తుమ్మితే ఊడిపోయే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అంటూ ఎద్దేవా చేశారు. ఎంఐఎం మధ్యవర్తిత్వంతో మాజీ సీఎం, ప్రస్తుత సీఎంల మధ్య అవగాహన కుదిరిందన్నారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్.. మూడు పార్టీలకు అంగీకారానికొచ్చాయన్నారు. అవినీతి, కుటుంబ పాలన వలనే ఎన్నికలల్లో ప్రజలు కేసీఆర్‌ను ఓడించారన్నారు. కాంగ్రెస్ పార్టీ మీద ప్రేమతో ప్రజలు అధికారం ఇవ్వలేదని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ, కేసీఆర్ పీడ విరగడ కావాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్‌కు అధికారమిచ్చారని వ్యాఖ్యలు చేశారు.



# కిషన్‌రెడ్డి కసరత్తు

## 15 మంది జిల్లా అధ్యక్షుల మార్పు?

# బీజేపీలో సంస్థాగత మార్పుచేర్పులపై

హైదరాబాద్: రాష్ట్ర పార్టీలో సంస్థాగతంగా చేపట్టాల్సిన మార్పుచేర్పులపై కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి దృష్టి పెట్టారు. దీర్ఘకాలికంగా కొనసాగుతుండడంతో పాటు ఎప్పటికప్పుడు పార్టీ అప్పగించిన బాధ్యతలను సరిగ్గా నిర్వహించని జిల్లా అధ్యక్షుల మార్పు దిశగా కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. పార్టీ పరంగా రాష్ట్రాన్ని 38 జిల్లాలుగా విభజించినందున, వీటిలో 15 నుంచి 20 జిల్లాలకు చురుగ్గా పనిచేసే కొత్త అధ్యక్షుల నియామకం దిశగా చర్యలు చేపట్టనున్నట్టు సమాచారం. పలువురు జిల్లా అధ్యక్షులు దాదాపు నాలుగేళ్లపాటు కొనసాగుతున్నందున పని తీరు, అప్పగించిన విధులు, బాధ్యతల నిర్వహణ, ఎన్నికల సందర్భంగా నిర్వహించిన పాత్ర తదితర అంశాల ప్రాతిపదికన మార్పు చేర్పులకు శ్రీకారం చుట్టనున్నట్టు చెబుతున్నారు. ఇటీవల పార్టీనాయకులతో కిషన్‌రెడ్డి సమావేశమైన సందర్భంగా సంస్థాగత మార్పులకు సంబంధించిన కసరత్తును మొదలుపెట్టినట్టు సమాచారం.

**ఇక కిషన్‌రెడ్డి టీం?** వచ్చే మార్చి, ఏప్రిల్‌లలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో...పకడ్బందీగా పనిచేసి మంచి ఫలితాలు సాధించేందుకు తన టీమ్‌ను నియమించుకునే దిశగా కిషన్‌రెడి చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికలకు పూరిస్థాయిలో సన్నద్ధం కావడంలో భాగంగా 17 ఎంపీ స్థానాల పరిధిలో పార్లమెంట్ కమిటీలను నియమించనున్నారు. అసెంబ్లీ ఎన్నికలసమయంలో పార్టీ కోసం సరిగ్గా పనిచేయని వారు, బీజేపీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు, దీర్ఘకాలికంగా జిల్లా అధ్యక్షులు, ఇతర బాధ్యతల్లో ఉన్న వారు, పార్టీ కార్యక్రమాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిని మార్చాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తున్నట్టు తెలిసింది.

**పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారికి షోకాజ్‌లు...** శాసనసభ

### ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారికి షోకాజ్‌లు

### పదవుల్లో ఉండి బాధ్యతలు నిర్వహించని వారికి కూడా..

### ఆరోపణల తీవ్రతను బట్టి సస్పెన్షన్లు ఉంటాయన్న వాదనలు

ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారితో పాటు అప్పగించిన బాధ్యతలు సరిగా నిర్వహించకుండా నిర్లక్ష్యం వహించిన పలువురికి బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ షోకాజ్ నోటీసులు జారీచేసింది.

వీరిలో ఇద్దరు ముగ్గురు జిల్లా అధ్యక్షులతో పాటు పదిమంది వరకు రాష్ట్రస్థాయి నాయకులు ఉంటారని తెలుస్తోంది. ఈ నోటీసులపై వారం, పదిరోజుల్లో వివరణ అందాక ఆరోపణల తీవ్రతను బట్టి సస్పెన్షన్లు, ఇతర చర్యలు ఉంటాయని చెబుతున్నారు. ఇటీవల పార్టీ కార్యాలయంలో కమిటీ చైర్మన్ ఎం.ధర్మారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కన్వీనర్ రవీందర్ విశ్వనాథ్, సభ్యులు నాగూరావు నామాజీ, పద్మజా రెడ్డి, బోసుపల్లి ప్రతాప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ స్థాయిల నాయకులపై వచ్చిన ఫిర్యాదులను ఈ కమిటీ పరిశీలించింది.

# సంపాదకీయం

## పెట్టుబడులు పెట్టిన కంపెనీల షేర్లు భారీ లాభాల్లో.. కానీ ఎల్ఐసీ షేర్ మాత్రం?

ప్రఖ్యాత ప్రభుత్వ రంగ బీమా కంపెనీ ఎల్ఐసీ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరమే లేదు. భారీగా నగదు నిల్వలు ఉండే ఎల్ఐసీ.. పలు కంపెనీల్లో పెట్టుబడులు పెట్టటం తెలిసిందే. తొలిసారి ఐపీవోకు వచ్చిన ఎల్ ఐసీ మీద ఉన్న అంచనాలు అన్ని ఇన్ని కావు. అయితే.. అందుకు భిన్నంగా పరిస్థితులు చోటు చేసుకోవటం.. షేర్లు అలాట్ అయితే సుడి తిరిగినట్లే అనుకున్న వారంతా.. అలాట్ అయిన తర్వాత మాత్రం తల పట్టుకునే పరిస్థితి. క్యాలెండర్ లో నెలలు మారటమే కానీ.. ఎల్ఐసీ షేరు ధర మాత్రం నేల చూపులు తప్పించి.. పైకి చూసిందే లేదు. ఇప్పటికి అలాట్ మెంట్ అయిన ధర కంటే తక్కువగా ఉండటం కనిపిస్తుంది. ఆసక్తికరమైన విషయం ఏమంటే.. ఎల్ ఐసీ షేరు ధర తక్కువగా ఉన్నా.. ఈ సంస్థ పెట్టుబడులు పెట్టే కంపెనీల షేర్లు మాత్రం ఝూమ్మంటూ దూసుకెళ్లటం కనిపిస్తుంది. స్టాక్ మార్కెట్ ను దుమ్ము రేపే కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన ఎల్ ఐసీని దేశంలోనే అతి పెద్ద బుల్ గా అభివర్ణిస్తారు. ఈ ఏడాదిలో స్టాక్ మార్కెట్ లో ఎల్ఐసీ పెట్టిన పెట్టుబడులకు వచ్చిన లాభం ఎంతో తెలుసా? అక్షరాల రూ. 2.28లక్షల కోట్లు. భారత స్టాక్ మార్కెట్లకు చెందిన 260 లిస్టెడ్ కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబడులు పెట్టగా.. వాటి విలువ గత ఏడాది డిసెంబరుతో పోలిస్తే.. ఈ ఏడాది భారీగా పెరిగింది. గత డిసెంబరులో రూ. 9.61 లక్షల కోట్లు ఉండగా.. తాజాగా వాటి విలువ రూ. 11.89 లక్ష కోట్లకు చేరుకోవటం గమనార్హం. సెప్టెంబరు నాటికి ఎల్ ఐసీ వద్ద ఉన్న షేర్లను.. వాటి ప్రస్తుత ధరలతో పోల్చి చూస్తే.. వావ్ అనుకోకుండా ఉండలేం. ఈ ఏడాది కాలంలో ఎల్ టీపీసీ షేరు ఏకంగా 85 శాతం లాభపడింది. ఈ కంపెనీలు ఎల్ఐసీ వాటా మార్కెట్ విలువ రూ. 2400 కోట్లకు పెరిగింది. ప్రభుత్వ రంగ కంపెనీల్లో బాగా లాభాలు పంచిన కంపెనీల్లో ఎన్ టీపీసీ ఒకటి. మరో ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా షేరు 67శాతం రాణించింది. అందులో ఎల్ ఐసీ వాటా విలువ 60 శాతం పెరిగి రూ. 24,100 కోట్లకు పైనే చేరుకుంది. ఎల్ అండ్ టీ షేరు 68 శాతం లాభాలు అందించటంతో ఎల్ ఐసీ హోల్డింగ్ 46 శాతం పెరిగి రూ. 52,800 కోట్లు నమోదైంది. టాటా మోటార్స్ ఈ ఏడాదిలో ఇప్పటివరకు 100 శాతం మేర పెరిగింది. ఎల్ ఐసీ వాటా విలువ ఏకంగా రూ. 14వేల కోట్లకు పైనే పెరిగింది ఈ షేరు మీద. ఎల్ఐసీ వాటాలున్న కనీసం 21 కంపెనీలు ఈ ఏడాది 300 శాతం మేర లాభాలు అందించటం విశేషంగా చెప్పాలి. బీఎస్ఈ షేర్లు మూడింతలకు పెరగటంతో ఈ ఏడాదిలో ఇప్పటివరకు 300 శాతం లాభాలు అందించాయి. సుజ్లాన్ ఎనరజీ 250 శాతం రాణించటం.. రైల్ వికాస్ నిగమ్ షేర్లు 160 శాతం.. ఇలా పలు కంపెనీల షేర్లు లాభాల బాట పట్టటంతో ఎల్ఐసీ స్టాకుల విలువ భారీగా పెరిగింది. ఇదంతా ఒక ఎత్తు అయితే.. సదరు ఎల్ఐసీ షేరు ధర మాత్రం ఇప్పటికి నీరసం కలిగించేలా ఉండటం అసలుసిసలైన ట్విస్టుగా చెప్పక తప్పదు.

# ప్రజా పాలన కార్యక్రమాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి

### ప్రజలకు మేలైన పాలన అందించడమే ప్రజా పాలన లక్ష్యం
### మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



జిల్లా బ్యూరో మేడ్చల్-మల్కాజ్గిరి (గరుడ వార్త) : అర్హులం దరికీ ఆరు గ్యారెంటీల లబ్ధిని చేకూరుస్తూ మెరుగైన ప్రభుత్వ పాలనను ప్రజలకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతం సూచించారు. అర్హులైన వారికి ఆరు గ్యారంటీల ద్వారా లబ్ధి చేకూరుస్తూ, ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసేం దుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. ప్రజాపాలన నాల్గవ రోజైన మంగళవారం నాడు తూముకుంట మున్సిపాలిటీ లోని వార్డ్ నెంబర్ 6 దేవర యంజాల్ లోని 13 వ వార్డ్ లో లో కొనసాగుతున్న. ప్రజాపాలన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వార్డులో కొనసాగుతున్న ప్రజా పాలన సభలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రజల సౌలభ్యం కోసం ఎన్ని కౌంటర్లను ఏర్పాటు చేశారు, దరఖాస్తులను అందుబాటులో ఉంచారా, దరఖాస్తులు నింపేందుకు వాలంటీర్లు, సిబ్బంది ప్రజలకు సహకారం అందిస్తున్నారా, తాగునీరు, కూర్చునేందుకు కుర్చీలు వంటి తగిన సదుపాయాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయా వంటి అంశాలను పరిశీలించారు. ఇప్పటివరకు స్వీకరించిన దరఖాస్తులు ఎన్ని, ఎక్కువగా ప్రజలు ఏ పథకం కోసం దరఖాస్తు చేస్తున్నారనే వివరాల గురించి అధికారులను ఆరా తీశారు. దరఖాస్తుఫారంలో నిర్దేశించిన వివిధ పథకాలతో పాటు ఇతర అంశాలపై కూడా ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్, అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గౌతమ్, మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామంలో, ప్రతి మున్సిపల్ వార్డుల్లో డిసెంబర్ 28నుండి జనవరి 6వ తేదీ వరకు ప్రజా పాలన కార్యక్రమం సాగుతుందని, గ్రామ, వార్డు సభలను నిర్వహించి ఏర్పాటు చేసిన కౌంటర్ల లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు పత్రాలకు ఎలాంటి కొరత లేదని, అవసరమైన ప్రాంతా లలో దరఖాస్తు ఫారాలను మరిన్ని ఇచ్చేవిధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దరఖాస్తు ఫారాలను ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుందని అన్నారు. దరఖాస్తు ఫారాలను బయట డబ్బులు పెట్టి కొనుగోలు చేసుకోవద్దని ప్రజలకు సూచించారు. దరఖాస్తు పత్రంలో రేషన్ కార్డు, ఆధార్ కార్డు సహా అన్ని వివరాలను నింపి ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించే 8 రోజులపాటు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ ఆదేశాల మేరకు కంప్యూటరైజ్డ్, డిజిటలైజ్ చేస్తామని అన్నారు. దరఖాస్తులను డిజిటలైజ్డ్ చేస్తున్నప్పుడు తప్పుడు వివరాలు ఉన్నప్పుడు సమస్య తలెత్తుతుందని, అందుకే దరఖాస్తు పత్రంలో సమగ్ర వివరాలు నమోదు చేయాలని ప్రజలకు సూచించారు. దరఖాస్తుల స్వీకరణ కోసం వృద్ధులు, మహిళలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తూముకుంట మునిసిపల్ కమిషనర్, జైత్ రామ్ నాయక్ , పలువురు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# అలియాబాద్ గ్రామంలో ప్రజా పాలన దరఖాస్తుల వెల్లువ



శామీర్ పేట (గరుడ వార్త) : ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు గాను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అభయహస్తం గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుంది. మంగళవారం శామీర్ పేట మండల పరిధిలోని అలియాబాద్ గ్రామం లో ఏర్పాటుచేసిన ప్రజా పాలన అభయహస్తం గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి గ్రామస్తుల అధిక సంఖ్యలో పాల్గొని తమ తమ దరఖాస్తులను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వజ్రేష్ యాదవ్ అలియాబాద్ లో నిర్వహించిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని సందర్శించారు. అలియాబాద్ గ్రామంలో మొత్తం 1252 దరఖాస్తులు అందాయి. అలియాబాద్ గ్రామ సర్పంచ్ గురుక కుమార్ యాదవ్, గ్రామ ఎంపీటీసీలు కోడూరి అశోక్, సగ్గు శ్రీను యాదవ్, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శితో కలిసి సమిష్టిగా కృషిచేసి గ్రామపంచాయతీ ఆవరణను ఆనుకొని ఉన్న విశాల ప్రాంగణంలో భారీ షామ్యానాలు వేసి 14 కౌంటర్లు ఏర్పాటు చేయడంతో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం బారులు తీరిన లైన్లు రసాభాసగా కాకుండా, సజావుగా సాగి అందరి మన్ననలు పొందింది. ముఖ్యంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కమటం కృష్ణారెడ్డి, గాదె వెంకటేష్ అదేవిధంగా బిజెపి సీనియర్ నాయకులు హృదయ కుమార్ తో పాటుగా టిఆర్ఎస్ నాయకులు పార్టీలకు అతీతంగా ప్రజా పాలన దరఖాస్తుల కార్యక్రమం గ్రామంలో ఉదయం మొదలైనప్పటి నుండి అయిపోయేంతవరకు అక్కడే ఉండి గ్రామస్తులకు అవసరమైన సలహాలు సూచనలు చేయడంతో ప్రజా పాలన దరఖాస్తులు కార్యక్రమం మరింత సజావుగా కొనసాగింది. ఇక అలియాబాద్ గ్రామంతో పాటుగా తూముకుంట మున్సిపాలిటీ, శామిర్ పేట, మూడుచింతలపల్లి మండలాల పరిధిలోని వివిధ పట్టణాలు, గ్రామాల్లో సైతం ప్రజా పాలన కార్యక్రమం పై స్థానిక ప్రజల నుండి విశేష స్పందన లభించింది.

# సైబరాబాద్ కమీషనరేట్ లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

### నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఐపీఎస్.,



సైబరాబాద్ క్రైమ్ (గరుడ వార్త) : నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని సైబరాబాద్ పోలీసు కమీషనర్ అవినాష్ మహంతి, ఐపీఎస్., ఈరోజు సైబరాబాద్ పోలీసు సిబ్బందితో కలిసి సైబరాబాద్ పోలీసు కమీషనరేట్ ఆవరణ లో కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. నూతన సంవత్సర వేడుకల్లో సైబరాబాద్ లిమిట్స్ లో ఎలాంటి అపశ్రుతులు జరగకుండా జి రో యాక్సిడెంట్ డే గా నిలిచిందన్నారు.

మానవ వనరులు, ఇతర వనరులను పూర్తి స్థాయిలో ప్రజా సేవకు ఉపయోగించాలన్నారు. ఉద్యోగులు తాము నిర్వర్తిస్తున్న విధుల పట్ల పూర్తి నిబద్ధత, అంకిత భావం కలిగి ఉండాలన్నారు. జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుండి ఎస్పి ర్యాంక్ అధికారి వరకు అందరూ తమ విధుల ప్రాముఖ్యతను గుర్తించి శ్రద్ధ, అంకిత భావంతో పని చేయాలన్నారు. ఈ వేడుకల్లో సైబరాబాద్ పోలీస్ కమీషనర్ అవినాష్ మహంతి, ఐపీఎస్., సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ నారాయణ్ నాయక్, ఐపీఎస్., బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, ఐపీఎస్., శంషాబాద్ డీసీపీ నారాయణ రెడ్డి, ఐపీఎస్., రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి, మేడ్చల్ డీసీపీ శబరీష్, ఐపీఎస్., డీసీపీ అడ్మిన్ రవి చందన్ రెడ్డి, రాజేంద్రనగర్ ఏడీసీపీ రష్మి పెరుమాళ్, ఐపీఎస్., మాదాపూర్ ఏడీసీపీ నంద్యాల నరసింహ రెడ్డి, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, సిఎస్‌డబ్ల్యు ఏడీసీపీ శ్రీనివాస్ రావు, ఇతర ఏడీసీపీలు, ఏసీపీలు, సీఏఓ అకౌంట్స్ చంద్రకళ, సీఏఓ అడ్మిన్ గీత, ఇన్ స్పెక్టర్లు, ఆర్ఐలు, సెక్షన్ల సిబ్బంది, పోలీసు సిబ్బంది మినిస్టీరియల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కొల్తురు, నారాయణ పూర్ గ్రామాల్లో ప్రజా పాలన గ్రామసభలను పర్శీలించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

జిల్లా బ్యూరో మేడ్చల్-మల్కాజ్గిరి (గరుడ వార్త) : అభయహస్తం 6 గ్యారంటీ పథకాల ద్వారా అమలు చేసేందుకుగాను సంక్షేమ పథకా లను పేదలు లబ్ధి పొందేందుకు చేపట్టిన ప్రజా పాలన దరఖాస్తు స్వీకరణ కార్యక్రమమును సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, తెలిపారు. మంగళవారం మూడు చింతల పల్లి మండలం లోని కొల్తురు, నారాయణ పూర్ , ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను అదనపు కలెక్టర్ విజయేందర్



రెడ్డి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమమును అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియం చేసుకోవాలని ఆయన తెలిపారు. రేషన్ కార్డు లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. దరఖాస్తు ఫారాలను తప్పులు లేకుండా నింపి అధికారులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలోఅధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మల్లారెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన శామీర్ పేట మండల సీనియర్ నాయకుడు వంగ వెంకట్ రెడ్డి



శామీర్ పేట (గరుడ వార్త) : నూతన ఆంగ్ల సంవత్సరం పురస్కరించుకొని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో కలుసుకొని శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేసిన, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన శామీర్ పేట మండల సీనియర్ నాయకుడు వంగ వెంకట్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నూతన సంవత్సరానికి పురస్కరించుకొని ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు.

### పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు సాంకేతిక లోపం వల్ల లబ్ధి పొందలేకపోతున్న

# సుమారు 50 మంది రైతుల సమస్య పరిష్కరించగలిగాం

### అలియాబాద్ గ్రామ సర్పంచ్ గురక కుమార్ యాదవ్

శామీర్ పేట (గరుడ వార్త) : పీఎం కిసాన్ సమ్మాన్ నిధి లబ్ధిదారుల ఖాతాల్లో సాంకేతిక లోపం వల్ల డబ్బులు జమ కాని రైతుల సమస్యలను వ్యవసాయ శాఖ, పోస్టల్ శాఖ సమన్వయంతో అలియాబాద్ లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన వేదికను ఉపయోగిస్తూ సుమారు 50 మంది రైతులు లబ్ధి పొందారని అలియాబాద్ గ్రామ సర్పంచ్ గురుకు కుమార్ తెలియజేశారు. ఇక వివరాల్లోకి వెళితే... కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమాన్ నిధి డబ్బులు కొందరి రైతుల ఖాతాల్లో గత కొంతకాలంగా జమ



కావడం లేదు. ఇందుకు ప్రధాన కారణం సదరు రైతుల బ్యాంకు ఖాతాల్లో ఈ కేవైసీ లోపం ఉండడం లేదా ముఖ్యంగా ఆధార్ సీడింగ్ కాకపోవడం. అయితే ఆధార్ సీడింగ్ చేసే సౌలభ్యం కేవలం బ్యాంకర్లకు మాత్రమే ఉండటంతో సమస్య పరిష్కారానికి ఎక్కువ జాప్యం జరుగుతుండడం గమనించిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు నూతనంగా పోస్టల్ శాఖకు కూడా ఆధార్ సీడింగ్ చేసే సౌలభ్యాన్ని కల్పించడంతో, ఇకమీదట పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు సదరు రైతుల ఖాతాలో జమ కాని రైతులు... పోస్టల్ బ్యాంకులో నూతన ఖాతాను కేవలం 200 రూపాయలు చెల్లించి బ్యాంకు ఖాతా తెరవడం వల్ల, సదరు రైతు పోస్టల్ బ్యాంకు ఖాతాకు ఈ కేవైసీతో పాటు ఆధార్ సీడింగ్ కూడా తక్షణం చేయడం జరుగుతుంది. దీంతో మంగళవారం అలియాబాద్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో పోస్టల్ శాఖతో పాటు ఆరోగ్యశాఖ సమన్వయంగా ఓ ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి పిఎం కిసాన్ సామాన్ నిధి డబ్బులు అందని రైతులు సుమారు 50 మందికి పోస్టల్ ఖాతాలు తెరిచి వారి ఖాతాలోకి ఈ కేవైసీ తో పాటుగా ఆధార్ సీడింగ్ సైతం నిర్వహించడం జరిగిందని, తద్వారా వారికి ఇక మీదట పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుండి అందే డబ్బులు నేరుగా వారి ఖాతాల్లోనే జమ కావడం జరుగుతోందని వ్యవసాయ శాఖ అధికారి రవి గంగుల తెలిపారు.

## 2.66 లక్షల క్వింటాళ్ల సీఎంఆర్ ధాన్యం పక్కదారి!

హుజూరాబాద్ : ప్రభుత్వం మిల్లర్లకు కేటాయించిన సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ధాన్యాన్ని మరాడించి ఆర్నెల్ల లోపు బియ్యాన్ని తిరిగిచ్చేయాలి. అంటే ఒక సీజన్‌లో అప్పగించిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి అదే సీజన్‌లో ఎఫ్‌సీఐకి తిరిగివ్వాలి. కానీ నెలలు గడిచినా మిల్లింగ్ చేసిన బియ్యాన్ని అప్పగించకుండా మిల్లర్లు ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఈ వ్యవహారం టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడుల్లో బట్టబయలవుతోంది. 2022-23 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి సీఎంఆర్ కింద హుజూరాబాద్, జమ్మికుంటలోని ఆరు రైస్‌మిల్లులకు 5.41 లక్షల క్వింటాళ్ల ధాన్యం కేటాయించగా 2.66 లక్షల క్వింటాళ్ల ధాన్యం పక్కదారి పట్టినట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. అంటే 42 శాతం ధాన్యం మాయం చేశారు. విలువ దాదాపు రూ.52.13 కోట్లు పైగానే ఉంటుంది. హుజూరాబాద్‌లోని ఓ మిల్లుకు 53 వేల కింటాళ్ల ధాన్యం కేటాయించగా నిర్వహించిన తనిఖీలో 26 వేల క్వింటాళ్లు లేవు. మరో ఇండస్ట్రీస్‌కు 24వేల క్వింటాళ్ల ధాన్యం కేటాయించగా 18 వేల క్వింటాళ్లు తేడా ఉన్నట్లు గుర్తించారు. మరో మిల్లుకు 18వేల క్వింటాళ్ల ధాన్యం కేటాయించగా ఇంతవరకు ఒక్క గింజా బియ్యం తిరిగివ్వలేదు. ధాన్యం నిల్వల్లో కూడా వ్యత్యాసం ఉన్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. 66 వేల క్వింటాళ్ల ధాన్యం ఓ మిల్లుకు కేటాయించగా తనిఖీలో 32 వేల క్వింటాళ్లు కనిపించ లేదు. అలాగే జమ్మికుంటలోని మిల్లుకు 1.60 క్వింటాళ్ల ధాన్యం కేటాయించగా 87 వేల క్వింటాళ్లు లేనట్లు అధికారుల తనిఖీల్లో బట్టబయలైంది. ఇల్లందకుంటలోని మిల్లుకు 2.20 లక్షల క్వింటాళ్ల ధాన్యం కేటాయించగా 85 క్వింటాళ్లు తేడా ఉన్నట్లు గుర్తించారు. ఈ రెండు మిల్లులు ఒకే వ్యక్తికి సంబంధించినవి కాగా రూ.33.71 కోట్ల విలువైన 1.72 లక్షల క్వింటాళ్ల ధాన్యంలో వ్యత్యాసం ఉండటం గమనార్హం. భారీ మొత్తంలో సీఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టిందని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదికలిచ్చి తదుపరి చర్యలకు



ముందుకు వెళ్తామని టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్డీ ప్రభాకర్‌రావు స్పష్టం చేస్తున్నారు. ఈనెల 31వ తేదీన సీఎంఆర్ గడువు ముగుస్తుండగా భారీ మొత్తంలో ధాన్యం పక్కదారి పట్టడాన్ని చూసి అధికారులే విస్తుపోతున్నారు. కాగా గతేడాది సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేయని మిల్లులకు కూడా 2022-23 వానాకాలం, యాసంగిలో ధాన్యం కేటాయించడం వెనుక మతలబు ఏమిటో పౌరసరఫరాల సంస్థ అధికారులకే తెలియాలి.

తనిఖీలు లేకపోవడం వల్లే.. : నిరంతరం తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే మిల్లుల్లోని సీఎంఆర్ ధాన్యం పక్కదారి పడుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. మిల్లులకు కేటాయించిన సీఎంఆర్ ధాన్యం ఎంత, మరాడించిన బియ్యం ఎంత.. మిల్లుల్లో ధాన్యం ఎంత నిల్వ ఉందనే వివరాలను తెలుసుకునేలా పౌరసరఫరాల శాఖ డీటీలు ఎప్పటికప్పుడు మిల్లులను తనిఖీ చేయాలి. కానీ ఎక్కడా తనిఖీలు నిర్వహిస్తున్న దాఖలాలు కనబడటం లేదు. ఇదే అదనుగా మిల్లర్లు సీఎంఆర్ ధాన్యాన్ని యథేచ్ఛగా పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నారు. తనిఖీల సమయంలో అక్రమాలను గుర్తించకుండా మిల్లుల్లో ధాన్యం బస్తాలను అస్తవ్యస్తంగా పడేయడం, బియ్యాన్ని రాశులుగా పోస్తున్నారు. దీంతో ధాన్యం సంచుల లెక్కలు తేల్చడం కష్టమవుతుందని అధికారులు అంటున్నారు. ఏదిఏమైనా ఒక సీజన్‌లో కేటాయించిన సీఎంఆర్ ధాన్యాన్ని మరాడించి అదే సీజన్ ముగిసే సమయానికి బియ్యం ఎందుకు తిరిగివ్వడం లేదనే విషయంపై కూడా అధికారులు దృష్టి పెట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించి సీఎంఆర్ ధాన్యం లెక్కల్లో లోపాలను గుర్తించే వరకూ స్థానిక అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొందరు మిల్లర్లు కనీసం సీఎంఆర్ కింద వచ్చిన ధాన్యం ఎంత.. తిరిగి ఇవ్వాల్సిన బియ్యం ఎంత.. మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యం ఎంతనే లెక్కలను నమోదు చేయడం లేదు. దీనిపై అధికారులు దృష్టి పెడితే అక్రమాలు తగ్గే అవకాశం ఉంది.

## కోడిగుడ్డు ధర పైపైకి

భానుపురి : జిల్లాలో కోడిగుడ్డు ధర రోజురోజుకూ పెరుగుతోంది. మాంసాహారం తర్వాత ఎక్కువగా తినే గుడ్డును కొనేందుకు వెళ్తే అకస్మాత్తుగా పెరిగిన ధరలే కనిపిస్తున్నాయి. గతంలో డజన్ కోడిగుడ్లు రూ.66కు రాగా నేడు రూ.84కు చేరింది. అంటే ఒక్క గడ్డు ధర రూ.7 పలుకుతోంది. వారంలోనే డజన్ రూ.18 పెరగడంపై వినియోగదారులు అసహనం వ్యక్తంచేస్తున్నారు.

పెరుగుదలకు కారణం..ఇటీవల కోళ్ల దాణా ధరలు పెరిగాయి. గతంలో కిలో రూ.15 నుంచి రూ.17 వరకు ఉండేది. ప్రస్తుతం ఒక్కసారి రూ.28కి పెరిగింది. కోళ్ల దాణా ఖర్చులు పెరగడంతో గుడ్డు ధరలు పెంచాల్సి వచ్చిందని కోళ్ల ఫారాల నిర్వాహకులు తెలిపారు. గతంలో గుడ్డుకు రూ.5.25 ధర పలికితే తమకు గిట్టుబాటు అయ్యేదని, దాణా ధరలు పెరగటం, డిమాండ్‌కు తగ్గట్లు గుడ్ల ఉత్పత్తి కాకపోవటంతో కొరత ఏర్పడింది. దీంతో కోడిగుడ్లకు ధర పెంచక తప్పటంలేదని చెబుతున్నారు.

భారమవుతున్న రవాణా

యాదాద్రి భువనగిరి, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో పౌల్ట్రీ ఫాంలు పదుల సంఖ్యలో ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి కోడిగుడ్లను దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లా వ్యాపారులు రంగారెడ్డి, షాద్‌నగర్, మహబూబ్‌నగర్, మహారాష్ట్ర నుంచి గుడ్లను తీసుకొస్తున్నారు. అక్కడ ఒక గుడ్డు రూ.5.30 పైసలు పడుతోంది. రవాణా ఖర్చులు పెరగడంతో రూ.7కు విక్రయిస్తున్నారు. జిల్లాలో రోజుకు 15 నుంచి 20 లక్షల కోడిగుడ్ల విక్రయాలు సాగుతుంటాయని, ఇలాగే కొరత సాగితే ఇంకా ధర పెరిగే అవకాశం ఉందని నిర్వాహకులు చెబుతున్నారు.

# మూడు నెలల్లో ముగుస్తాయా?



కరీంనగర్ : రహదారులు భవనాల శాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగాల పరిధిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అన్నిరకాల పనులు కలిపి దాదాపుగా 2 వేలకు పైగా ఇంకా నడుస్తున్నాయి. చాలాచోట్ల బిల్లులు రాక పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇందులో సీడీపీ (నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం) నిధులతోపాటు ఉపాధి హామీతో చేపడుతున్న రహదారులు అధికంగా ఉన్నాయి. కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల్లోని అదనపు గదులతోపాటు గురుకులాల చెంతన ప్రగతి పనుల విషయంలో జాప్యం జరుగుతోంది. పెద్దపల్లి జిల్లాలో రూ.16.30 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో వేస్తున్న రోడ్లు వివిధ స్థాయిలో ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. 13 నియోజకవర్గాల పరిధిలో వంతెనలు, రోడ్ల మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టుల నిర్మాణాలు నింపాదిగా నడుస్తున్నాయి.

కరీంనగర్ పట్టణ శివారులోని తీగలగుట్టపల్లి నుంచి ఆరెపల్లి వెళ్లే మార్గంలోని ఇంకా నిర్మాణ దశలోనే ఉన్న రోడ్డు ఇది.. రహదారులు భవనాల శాఖ పరిధిలో చేస్తున్న ఈ పని ఇంకా పూర్తి కాలేదు. దీంతో ప్రజలు నిర్మాణం కోసం వేసిన కంకర రాళ్ల పైనుంచే నెలల తరబడి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. ప్రజా పనుల విభాగం (పీడబ్ల్యూడీ) పర్యవేక్షణలో కొనసాగుతున్న ఈ రోడ్డు విస్తరణ సహా అభివృద్ధికి పనుల్ని పలు విభాగాలుగా చేపడుతున్నారు. బిల్లులు సక్రమంగా రావడం లేదనే ఉద్దేశంతోనే ఇలా ఈ మార్గంలో చాలా చోట్ల ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయాయి. నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాల్సిన ఈ మార్గాన్ని కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. సమయం తక్కువే.. : మరో మూడు నెలలు.. దాదాపుగా 90కిపైగా రోజులు.. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఉన్న గడువు. శాసనసభ ఎన్నికలతో దాదాపు నెలన్నర పాటు కొత్త పనుల ఊసే కనిపించలేదు. ప్రస్తుతం తక్కువ వ్యవధి ఉండటంతో పనులు ఏమేరకు జరుగుతాయనేది ప్రశ్నగానే మారింది. చేయాల్సిన పనులు దండిగా ఉన్నా.. అనుకున్న విధంగా కాసుల గలగలలు వినిపించకపోవడమూ పనులు ప్రగతి దశలోనే ఉండిపోవడానికి కారణమని అధికారులు చెబుతున్నారు. ఇటీవల ప్రభుత్వం మారడంతోనూ కొన్ని పనుల విషయంలో మీమాంస తప్పడం లేదు. వివిధ శాఖలకు జరిగిన కేటాయింపుల విషయంలో మరిన్ని నిధులు నాలుగు జిల్లాలకు రావాల్సి ఉంది. మరోవైపు మంజూరైన నిధులకు సంబంధించిన పనులు సకాలంలో ప్రారంభించకపోవడంతో ఆ నిధులు వెనక్కివెళ్లే ప్రమాదం పొంచి ఉంది.

ఆ పనుల ఊసే లేదు.. : ఇటీవల శాసనసభ ఎన్నికల ముందర అన్ని నియోజకవర్గాల్లో అన్ని శాఖల అధికారులు ఇష్టానుసారంగా పలు రకాల అభివృద్ధి పనులకు పచ్చజెండా ఊపారు. రోడ్లు, మురుగు కాలువలు, సామూహిక భవనాలు, సెంట్రల్ లైటింగ్ సహా ఇతరత్రా పనులకు ప్రజాప్రతినిధులు కొబ్బరికాయలు కొట్టారు. శిలాఫలకాల్ని దండిగానే ఆవిష్కరించారు. ఇందులో చాలావాటికి పాలనాపరమైన అనుమతులు లేవని, అయినా ఇష్టానుసారంగా చేపడుతున్నారనే విమర్శలు అప్పట్లో వినిపించాయి. ఆగమేఘాల మీద ప్రారంభించిన ఈ పనుల ప్రగతి మాత్రం ప్రస్తుతం అటకెక్కింది. ఒక్కో నియోజకవర్గంలో దాదాపుగా 120 నుంచి 150 పనులు ఇలా ప్రారంభించినవి ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపుగా రూ.1600కోట్లకుపైగా వ్యయంతో వీటిని చేపట్టాల్సి ఉన్నా.. వీటికి సంబంధించిన నిధుల మంజూరు విషయంలో ఇంకా ఆయా శాఖలు స్పష్టమైన ఆదేశాల్ని ఇవ్వలేదని సమాచారం.

# విద్యావనంలో విజ్ఞాన పరిమళాలు



పెద్దపల్లి : విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచి, అక్షర విజ్ఞానం పెంపొందించేందుకు విద్యా శాఖ గ్రంథాలయాలు(రీడింగ్ కార్నర్‌లు) ఏర్పాటు చేస్తోంది. 'మన ఊరు-మన బడి'లో అభివృద్ధి చేసిన పాఠశాలలకు పుస్తకాలు అందిస్తోంది. బాల్యం నుంచే పఠనాసక్తిని పెంచి పరిపూర్ణంగా తీర్చిదిద్దాలని అధికారులు భావిస్తున్నారు. గ్రంథాలయాల ఏర్పాటులో భాగంగా ఈ ఏడాది జనవరిలో ప్రయోగాత్మకంగా కొన్ని పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేశారు. మరో విడతలో విజ్ఞానదాయకమైన పుస్తకాలు అందించాలని నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాలో రెండో విడతలో 868 పాఠశాలలకు అవకాశం దక్కింది. ఒక్కో బడికి విజ్ఞానం, వినోదానికి అవసరమైన 240 రకాల పుస్తకాలు సరఫరా చేయనున్నారు. తొలి విడతలో 608 పాఠశాలల్లోని విద్యార్థులు క్రమం తప్పకుండా పుస్తకాలు చదువుతూ విజ్ఞానం పెంచుకుంటున్నారు.

పఠనానికి ప్రత్యేక పీరియడ్

పాఠశాల గ్రంథాలయంలో విద్యార్థులను చదివించేందుకు ప్రత్యేక పీరియడ్ కేటాయించారు. ఆయా పుస్తకాలపై ప్రామాణికమైన విషయాలను ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. సమగ్ర అంశాలపై విద్యార్థులు పట్టు సాధించేందుకు చొరవ చూపుతున్నారు. చదివిన అంశాలు ఏ మేరకు గుర్తున్నాయో పరీక్షిస్తున్నారు. పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారు. పలు చోట్ల స్వచ్ఛంద సంస్థలు, దాతల విరాళాలతో మరిన్ని పుస్తకాలు కొనుగోలు చేసుకొని సమకూర్చుకుంటున్నారు.

రెండో విడతలో 868 చోట్ల..

ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఎంపికైన వాటికి పుస్తకాలు పంపిణీ చేసేందుకు రూమ్ టూ రీడ్, నేషనల్ బుక్ ట్రస్టు అనే స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకున్నారు. పిల్లల్లో పఠనాన్ని అలవాటుగా చేయడం, స్వతంత్ర పాఠకులుగా ఎదిగేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ప్రతి పాఠశాలకు 240 రకాల పుస్తకాలు, కార్పెట్లు, 9 రకాల గోడపత్రికలను పంపిణీ చేయనున్నారు. గ్రంథాలయాల నిర్వహణ, పుస్తకాలు భద్రపరచడంపై జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఉమ్మడి జిల్లాలో 868 పాఠశాలలకు మొత్తం 2.08 లక్షల పుస్తకాలు రానున్నాయి.

ఆకర్షణీయంగా రూపకల్పన

పిల్లలను ఆకట్టుకునేలా పుస్తకాలపై ఆకర్షణీయ రంగుల బొమ్మలతో ముద్రించారు. వీటిలో బాల సాహిత్యం, చిత్ర పుస్తకాలు, కథలు, కార్డులు, సమాచార పుస్తకాలు, కవితా సంకలనాలు, పోస్టర్లు, కరపత్రాలున్నాయి. విద్యార్థుల స్థాయికి తగిన విజ్ఞానం అందుకునేలా వీటిని రూపొందించారు. మొదటి స్థాయి(ఆకుపచ్చ) సరళ అక్షరాలు, రెండో స్థాయి(ఎరుపు) సరళ పదాలు, మూడో స్థాయి(నారింజ) ద్విత్వాక్షరాలు, స్వల్ప ఒత్తుల పదాలు, నాలుగో స్థాయి(తెలుపు) చిన్న చిన్న పేరాలు, అయిదో స్థాయి(నీలి) ఆసక్తిగా ఉండే రెండు, మూడు పేరాలు, ఆరో స్థాయి(పసుపు) విద్యార్థి ఎవరి సాయం లేకుండానే స్వయంగా చదవగలిగే పుస్తకాలున్నాయి.


# పరీక్షలు ముందుకు.. ఉత్తీర్ణత వెనక్కు

సిరిసిల్ల : వీర్నపల్లి మండలం గర్జనపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 24 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ ఏడుగురు ఉపాధ్యాయులు, ఒక పీజీ హెచ్‌ఎం ఉండాలి. కానీ జీవశాస్త్రం, తెలుగు, హిందీ, ప్రధానోపాధ్యాయుడు, భౌతికశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు ఉన్నారు. సాంఘిక శాస్త్రం బోధించేందుకు ఇటీవల ఒక ఎస్జీటీని డిప్యూటేషన్‌పై నియమించారు. ఆంగ్ల మాధ్యమం కావడంతో బోధనలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భౌతికశాస్త్రం బోధించే పీజీ హెచ్‌ఎంకు ఆపరేషన్ జరగడంతో రెండు నెలలుగా సెలవులో ఉన్నారు. గణితం, ఆంగ్లం పాఠ్యాంశాలు సగం కూడా పూర్తికాలేదు. ఉన్న ఉపాధ్యాయులే మిగతా పాఠ్యాంశాలు బోధిస్తున్నారు.

గంభీరావుపేట మండలం ముచ్చర్లలో 95 మంది, నాగంపేటలో 122 మంది విద్యార్థులున్న రెండు పాఠశాలల్లో గణితం ఉపాధ్యాయులు లేరు. నాగంపేటలో విద్యార్థుల తల్లిదండ్రులు చందాలు వేసుకుని గ్రామానికి చెందిన యువతితో గణితం పాఠ్యాంశాలు చెప్పిస్తున్నారు. నాగంపేటలో పీజీ హెచ్‌ఎం గణితం కావడంతో విద్యార్థుల బోధనలో ఇబ్బందులు లేవు. కానీ ఇప్పటికీ సిలబస్ అసంపూర్తిగానే ఉంది.

విద్యార్థి భవిష్యత్తుకు పదో తరగతి పునాది లాంటిది. ఇక్కడ మంచి ప్రతిభ చాటితే ఉన్నత చదువుల్లో బాగా రాణించగలుగుతారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో భిన్నమైన పరిస్థితులున్నాయి. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఈ నెలాఖరులోగా అన్ని పాఠ్యాంశాల్లో సిలబస్ పూర్తికావాలి. జనవరిలో పునఃశ్చరణ తరగతులు నిర్వహించాల్సి ఉంది. సబ్జెక్ట్ టీచర్లు, భాషా పండితుల కొరత కారణంగా చాలా పాఠశాలల్లో సిలబస్ అసంపూర్తి దశలో ఉంది. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈసారి పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌ను ముందుకు జరిపే అవకాశాలున్నాయి. ఈ పరిణామాలు విద్యార్థుల ఉత్తీర్ణతపై చూపనున్నాయి.

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మొత్తం 510 ఉన్నాయి. వీటిలో 109 ఉన్నత పాఠశాల్లో 14,923 మంది విద్యార్థులుండగా వీరిలో 2,330 మంది పదో తరగతి వారున్నారు.



సెప్టెంబరులో స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు, బదిలీలతో చాలా వరకు ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ ప్రక్రియకు ముందు మొత్తం 361 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉన్నాయి. ప్రస్తుతం 23 పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లలో భాషా పండితులు, సబ్జెక్ట్ టీచర్లు కలిపి 29 ఖాళీలున్నాయి. ఇక్కడ పదోన్నతులు, బదిలీల ప్రక్రియ తర్వాత ఖాళీలు ఉన్నచోట పాఠశాలల కాంప్లెక్స్‌ల పరిధిలోని ఉపాధ్యాయులను బట్టి సర్దుబాటు చేయాలి. ప్రధానంగా సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్న చోట వాటికి అందుబాటులోని ఎస్జీటీలతో బోధన కొనసాగించేలా ప్రణాళికలు చేయాలి. నవంబరులో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో విద్యాశాఖ ప్రణాళికలు ఎక్కడివక్కడే ఉన్నాయి. ఈ ప్రభావం పదో తరగతి ఫలితాలపై పడుతోందని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పదోన్నతులతో పాటు బదిలీల ప్రక్రియ పూర్తి చేసి నూతన నియామకాలు చేపడితేనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెబుతున్నారు.

సర్దుబాటు చేశాం- రమేశ్‌కుమార్, డీఈవో

ఉపాధ్యాయుల కొరతపై ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ముగిశాక ఖాళీలు ఉన్న చోట విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉపాధ్యాయులను సర్దుబాటు చేశాం. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా ఇబ్బందులు లేవు. జనవరిలో పునఃశ్చరణ తరగతులు ప్రారంభిస్తాం.

## ప్రైవేటులో ఆయుష్మాన్ భవ

మిర్యాలగూడ : నిరుపేదలకు అత్యవసరమైన వైద్యసేవలను ప్రైవేటు ఆసుపత్రుల్లో సైతం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే సర్కారు దవాఖానాల్లో ప్రారంభించిన ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ప్రైవేటు ఆసుపత్రులకూ వర్తింపజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రైవేటు ఆసుపత్రులు నిర్ణీత విధానంలో తమ వివరాలను ఆయుష్మాన్ భవ విభాగంలో నమోదు చేసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. 'ఆరోగ్య సౌకర్యాల నమోదు', 'ఆరోగ్య ప్రొఫెషనల్స్ నమోదు' విధానంలో తమ దవాఖానాలు, వైద్యుల వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆసుపత్రుల వివరాలు నమోదు చేసుకోవాలి

కేసా రవి, జిల్లా ఉపవైద్యాధికారి

ప్రైవేటు ఆసుపత్రుల వారు తమ వివరాలు ప్రభుత్వం ఇచ్చిన నిర్ణీత విధానంలో నమోదు చేసుకోవాలి. ఓపీ రోగుల వివరాలు ఆన్‌లైన్‌లో పేర్కొనాలి. ఆసుపత్రుల వారు నేరుగా వివరాలు ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు లేకపోతే జిల్లా ఉపవైద్యాధికారి కార్యాలయానికి వస్తే అక్కడి సిబ్బంది సైతం నమోదు చేస్తారు.

రోగుల వివరాలు తప్పనిసరి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎనిమిది నెలల క్రితం నుంచే అక్కడికి వచ్చే రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో ఆయుష్మాన్ భవ కింద నమోదు చేస్తున్నా



రు. ఇప్పుడు కొత్తగా నమోదు చేసుకున్న ప్రైవేటు దవాఖానాల వారు రోజూ ఆయా ఆసుపత్రులకు వచ్చే రోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఆసుపత్రిలో చేరి వైద్యం పొందే వారి ఆరోగ్య సమాచారం ఆయుష్మాన్ భవ విభాగంలో పేర్కొనాలి. కేంద్రం అందిస్తున్న రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు, ప్రైవేటులకూ వర్తింపుజేసే దిశగా సన్నాహాలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో..ప్రైవేటు ఆసుపత్రుల వారు నేరుగా వెబ్‌సైట్‌లోకి వెళ్లి నమోదు చేసుకోవాలని, లేకుంటే జిల్లా ఉపవైద్యాధికారి కార్యాలయంలో నిర్ణీత వివరాలతో వచ్చి నమోదు చేసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. నల్గొండ జిల్లాలో 159 ఆసుపత్రులు, 14 నర్సింగ్‌హోమ్‌లు, 49 డెలివరీ కేంద్రాలు, 111 స్కానింగ్ సెంటర్లు, ఏడు ఈఎన్‌టీ ఆసుపత్రులు, 24 కంటి వైద్యశాలలు, 18 చిన్నపిల్లల ఆసుపత్రులు, 51 దంత వైద్యశాలలు 221 డయాగ్నస్టిక్ సెంటర్లు ఇతర ఆసుపత్రులు కలిపి మొత్తం 611 ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు, నర్సింగ్‌హోమ్‌లు, కంటి, దంత వైద్యశాలలు సుమారు 223 వరకు పనిచేస్తున్నాయి.


## నిధులొస్తేనే.. మిగులు పనులు పూర్తి

యాదగిరిగుట్ట : తెలంగాణ రాష్ట్రానికి మకుటంగా.. యాదాద్రి పంచనారసింహుల పుణ్యక్షేత్రాన్ని మరో తిరుమలగా రూపొందించే లక్ష్యంగా గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, నిధులొస్తేనే పూర్తి కానున్నాయి. గత ప్రభుత్వం క్షేత్రాభివృద్ధికి ఏర్పాటు చేసిన ప్రాధికార సంస్థ (వైటీడీఏ) ఆధ్వర్యాన కొండ కింద చేపట్టిన క్షేత్రాభివృద్ధి పనుల్లో పలు కట్టడాలు అసంపూర్తిగా మిగిలి పోయాయి. సదరు పనుల పూర్తికి అవసరమయ్యే నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో లక్ష్యం అటకెక్కింది. ఆ పనుల పూర్తి కోసం ప్రస్తుతం సుమారు రూ.250 కోట్లు అవసరమని అధికారులు భావిస్తున్నారు.

అసంపూర్తిగా.. ఆలయోత్సవాల్లో తెప్పోత్సవం నిర్వహణ కోసం కొండ కింద ఉత్తరాన సుమారు 40 ఎకరాల గండి చెరువును సుందరీకరణతో తీర్చిదిద్దాలని చేపట్టిన పనులు పూర్తి కాలేదు. క్షేత్ర సందర్శనకు వచ్చిన భక్తుల ఆహ్లాదానికి చుట్టూ పచ్చదనం పోషణ చేపట్టాల్సి ఉంది. కొండపైకి ప్రవేశ మార్గంలోని కనుమదారిలో ఫ్లైఓవర్ బ్రిడ్జి కోసం చేపట్టిన నిర్మాణంలో కేబుల్ బ్రిడ్జి పూర్తి కాకుండా, నిలిచిపోవడంతో భక్తులు ఇక్కట్లు పడుతున్నారు. 2.07 కి.మీ చుట్టూ గిరి ప్రదక్షిణ దారి నిర్మాణంలోనూ భక్తులకు అనుగుణంగా తీర్చిదిద్దాల్సి ఉంది. ఆ దారిలో రక్షణ గోడ పనులు పూర్తి కావాల్సి ఉంది. ఆధ్యాత్మిక వాడ నుంచి భక్తులు ఆలయానికి రాకపోకలు సాగించే ప్రయాణ ప్రాంగణం (ఆలయ బస్‌స్టేషన్) నిర్మాణాన్ని రూ.8.78 కోట్లతో 2.53 ఎకరాల్లో చేపట్టారు. నిధుల కొరతతో ఆ బస్‌స్టేషన్ అసంపూర్తిగా నిలిచింది. ఇక దుకాణాల సముదాయాలు, అన్నప్రసాదం భవనంతో పాటు ఈ క్షేత్రానికి వచ్చే సామాన్య భక్తుల కోసం వసతులు కల్పించాల్సి ఉంది. మెట్ల దారిని మెరుగు పరిచేందుకు అధికారులు శ్రద్ధ తీసుకోవాలి.

## దత్తత గ్రామంలో.. రైతుల దరిచేరి..

అశ్వారావుపేట : దత్తత అంటే ఏదో రెండు ఉపన్యాసాలు ఇచ్చి, ఆరు కరపత్రాలు పంపిణీ చేయడం కాదు.. రైతుల బాధలు, సాగు యాజమాన్య విధానాలు, పాడి, గ్రామాభివృద్ధి తదితరాలన్నీ తెలుసుకుని అభివృద్ధికి కృషిచేయడం అంటున్నారు అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు. తమ కళాశాల దత్తత గ్రామమైన అశ్వారావుపేట మండలం నారాయణపురంలో విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వారం పాటు గ్రామంలో రైతుల స్థితిగతులపై సర్వే నిర్వహించారు. రైతులు ఏ పంటలు పండిస్తున్నారు, అవలంభిస్తున్న పద్ధతులు ఏమిటి? రసాయనిక ఎరువులు, పురుగుమ ందుల వాడకం, సేంద్రియ సేద్యం పరిస్థితి ఎలా ఉంది? తదితర వివరాలన్నీ పరిశీలించారు. పాడి పరిశ్రమ ఎలా ఉందో విద్యార్థులు అవగాహన చేసుకున్నారు. ఇల్లిల్లు తిరిగి స్థానికులతో మాట్లాడి



వారి ఆర్థిక, సామాజిక స్థితిని తెలుసుకున్నారు. దుక్కి దున్నకం నుంచి పంట చేతికొచ్చే వరకూ అనుసరించే విధానాలపై రైతులతో మాట్లాడారు. పంటలకు పెట్టుబడి సాయం తీరు, సహకార రుణం, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి తెచ్చే అప్పులు, తీర్చే విధానాలు తెలుసుకున్నారు. 50మంది విద్యార్థులు బృందాలుగా విడిపోయి ఇల్లిల్లూ సర్వే చేశారు. రైతుల సమక్షంలో గ్రామ పటం రూపొందించారు. వీరి కృషిపై రైతులు మంత్ర ముగ్ధులయ్యారు.

# సిల్టు తరలింపుపేరిట నిధుల స్వాహా

హైదరాబాద్ : జలమండలిలో సిల్టు తరలింపు పేరుతో నిధుల స్వాహా పర్వం నడుస్తోంది. చాలా డివిజన్ కార్యాలయాల్లో సిల్టు తరలింపు వాహనాలే కన్పించడం లేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. కొన్ని తప్పా, చాలా వాహనాలు ఎక్కడ తిరుగుతున్నాయో తెలియని పరిస్థితి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో క్షేత్రస్థాయిలోని కొందరు అధికారుల దందా నడుస్తోంది. గ్రేటర్ వ్యాప్తంగా సిల్టు తరలింపునకు గత ప్రభుత్వ హయాంలో దళితబంధు కింద 162 వాహనాలు కొనుగోలు చేశారు. ఒక్కో వాహనానికి రూ.10 లక్షల వంతున మొత్తం రూ.16 కోట్లకు పైగా వెచ్చించారు. లబ్ధిదారుల ఎంపిక మొత్తం అప్పటి ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో సాగింది. తమకు కావాల్సిన వారికి కేటాయించారనే ఆరోపణలు విన్పించాయి. దీంతో నిజమైన లబ్ధిదారులు నష్టపోయారు. తర్వాత వీటిని జలమండలి అద్దె ప్రాతిపదికన తమ అవసరాలకు తీసుకునేలా అధికారికంగా ఏర్పాట్లు చేశారు. వీటికి అయ్యే అద్దె, డ్రైవర్ల జీతభత్యాలు, డీజిల్ ఇతర ఖర్చులన్నీ జలమండలి భరించేలా ఒప్పందం కుదిరింది. ఇలా 162 వాహనాలకు ఏటా రూ.23.32 కోట్లు వరకు చెల్లింపులు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇక్కడ వరకు బాగానే ఉన్నా.. వీటి పనితీరు అంతంత మాత్రంగా ఉండటంతో జలమండలికి నెలా నెలా భారం తప్పడం లేదు.



అక్రమాలు ఇలా..

ఈ వాహనాలను అసలైన లబ్ధిదారులకు కాకుండా అప్పటి ప్రజాప్రతినిధులు కొందరు తమకు నచ్చిన వారికి అప్పగించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇద్దరు మాజీల బినామీల చేతిలోనే చాలా వాహనాలు ఉన్నాయని అంటున్నారు. సమగ్ర విచారణతో గుట్టు బయటపడే అవకాశం ఉంది.

ప్రతి వాహనం రోజూ నిర్ణీత మొత్తంలో సిల్టు తరలించాలి. ఇందుకు ఆయా డివిజన్ కార్యాలయాల్లో వాహనాలను అందుబాటులో ఉంచాలి. ప్రతి వాహనానికి రూ.5-10 వేల చొప్పున నెలా నెలా కమీషన్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సిల్టు తరలించకుండా బిల్లు తీసుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది.

జలమండలి పరిధిలో ఏదైనా వాహనం అద్దెకు తీసుకుంటే అద్దె మాత్రమే చెల్లిస్తారు. డ్రైవర్ జీతం, డీజిల్, బీమా లాంటివి సదరు వాహన యజమానులే చూసుకోవాలి. ఈ వాహనాలకు గరిష్ఠంగా చెల్లింపులు చేస్తున్నారు. అద్దె, డ్రైవర్ జీతం, ఇద్దరు కార్మికులకు జీతాలు, డీజిల్ ఖర్చు, లూబ్రికెంట్, బీమా.. ఇలా అన్ని ఖర్చులు బోర్డే భరిస్తోంది. ఇలా ఒక్కో వాహనానికి నెలకు రూ.1.2 లక్షలు వెళ్తున్నాయి.

ప్రతి వాహనానికి ఒక డ్రైవరు, ఇద్దరు సహాయకులు ఉండాలి. అయితే డ్రైవర్, ఒక సహాయకుడితోనే నెట్టుకొస్తున్నారు. ఆ డబ్బులు కూడా అసలు వాహన యజమానులే తీసుకుంటున్నారు. విధి నిర్వహణలో ధరించే బూట్లు, యూనిఫాం, హెల్మెట్, గ్లౌజ్ వంటి వాటికి అదనంగా రూ.3 వేలు విలువైన భద్రతా పరికరాలు జలమండలి సరఫరా చేస్తోంది. ఇవి కూడా ఎక్కడా వాడుతున్నట్లు కన్పించడం లేదు.

# కాలువ పనుల్లో గుత్తేదారు ఇష్టారాజ్యం

వేములవాడ : వేములవాడ పట్టణంలో మురుగు కాలువల నిర్మాణ పనుల్లో గుత్తేదారు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం పట్ల ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కాలువలు చాలా ఎత్తుగా నిర్మించడంతో దుకాణాల ఫ్లోరింగ్‌ను మించిపోయాయి. దీంతో వ్యాపారుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది. మరోవైపు పనులను గుత్తేదారు నిబంధనల ప్రకారం చేపట్టకపోవడంతో మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్మాణ సామగ్రిని మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. పట్టణంలోని రాజన్న ఆలయం ప్రధాన ద్వారం మెట్ల వైపు నుంచి గోశాల మీదుగా జగిత్యాల బస్టాప్ కూడలి వరకు దాదాపు ఆరు వందల మీటర్లు, మరోవైపు పట్టణంలోని తెలంగాణ కూడలి నుంచి పాపన్నగౌడ్ కూడలి వరకు మరో ఆరు వందల మీటర్ల పొడవు ఇరువైపులా కాలువలు నిర్మించి ఫుట్‌పాత్‌ల ఏర్పాటుకు వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) నిధులు రూ.90 లక్షలను కేటాయించారు. ఈ నిధులతో ఈ రెండు ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా కాలువలు నిర్మించి వాటిపై స్లాబ్ నిర్మించాల్సి ఉంది. స్లాబ్‌లు వేయాల్సిన సమయంలో వాటిలో పేరుకుపోయిన మురుగు, వ్యర్థాలను పూర్తిగా తొలగించాలి. మురుగు తొలగించేందుకు మధ్యలో అక్కడక్కడ చాంబర్లు ఏర్పాటు చేసి పనులు చేపట్టాలి. ఇందుకు భిన్నంగా పనులు చేస్తుండటంతో స్థానికుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది. ప్రస్తుతం కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన రావడంతో వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. వినియోగదారులు దుకాణాల ముందు నిలబడలేని దుస్థితి నెలకొంది.

వ్యాపారుల నుంచి డబ్బులు...కాలువల్లో వ్యర్థాలను తొలగించకుండానే మురుగు కాలువపై స్లాబ్‌ల నిర్మాణం చేస్తున్నారనే సమాచారం మేరకు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, సిబ్బంది పట్టణంలోని పాపన్నగౌడ్ కూడలి వైపు స్లాబ్ నిర్మాణానికి అమర్చుతున్న రీపర్ చెక్కలు, ఇనుప సలాకను మున్సిపల్‌కు తరలించారు. నిబంధనల ప్రకారం ప్రారంభం నుంచి పనులు చేయాల్సి ఉన్నప్పటికీ ఏ వ్యాపారి డబ్బులు ఇస్తే అక్కడ సిమెంట్ స్లాబ్‌ల నిర్మాణం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒక్కొక్కరి నుంచి రూ.1,500 నుంచి రూ. 2 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. డబ్బులు ఇచ్చిన వారి దుకాణాల ముందు కాలువపై సిమెంట్ స్లాబ్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు. డబ్బులు ఇవ్వని వారి దుకాణాల ముందు చేయడం లేదని చెబుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం- కిరణ్‌కుమార్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, వేములవాడ కాలువల్లో మురుగు, నిర్మాణ వ్యర్థాలు తొలగించిన తరవాత కాలువలపై సిమెంట్ స్లాబ్ వేయాల్సి ఉంది. మురుగు తొలగించకుండానే సిమెంట్ స్లాబ్‌ల నిర్మాణం చేయడం వల్ల తరవాత మురుగు సమస్య ఏర్పడుతుంది. డబ్బులు ఇచ్చిన వారి దుకాణాల ముందు సిమెంట్ స్లాబ్ నిర్మాణం చేస్తున్నట్లు పలువురు వ్యాపారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం సిమెంట్ స్లాబ్‌ల నిర్మాణం సందర్భంగా తప్పక చాంబర్లు అక్కడక్కడ ఏర్పాటు చేయాలి. అవి ఏర్పాటు చేయడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుంది.

# లంచమిస్తే.. అన్నీ రైటే!




హైదరాబాద్ : నిబంధనల ప్రకారం.. రోజుకు రూ.3,500 ల కంటే ఎక్కువ వ్యాపారం జరిగే కేంద్రాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సు తీసుకోవాలి. దానికి రూ.2 వేల రుసుము చెల్లించాలి. అంతకంటే తక్కువ వ్యాపారం జరిగే కేంద్రాలు జీహెచ్ఎంసీకి రూ.100 చెల్లించి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

జీహెచ్ఎంసీలో నాలుగేళ్ల క్రితం ముగ్గురు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉండేవారు. ఖాళీలను భర్తీ చేయడంతో.. ప్రస్తుతం 23 మంది ఉన్నారు. కొత్తగా విధుల్లో చేరిన కొందరు ఉద్యోగులపై ఆరోపణలు వస్తున్నాయి. ఆహార కల్తీ జరిగిందని, నాసిరకం పదార్థాలు వడ్డించారని, కల్తీ తయారు చేస్తున్నారంటూ వచ్చే ఫిర్యాదులను సొమ్ము చేసుకుంటున్నారు.

ఎర్రగా కనిపించే మాంసాహార వంటకాలు, బంగారు వర్ణంలోని లడ్డూలు, బిర్యానీలో అతిగా వాడే రంగులు క్యాన్సర్ వంటి సమస్యలకు దారి తీస్తాయని వైద్యులు హెచ్చరిస్తుంటే.. చర్యలకు జీహెచ్ఎంసీ చొరవ తీసుకోవట్లేదు. కొన్ని హోటళ్లలో చికెన్ తింటే..చేతి వేళ్లకి మెహిందీ పెట్టుకున్నట్లుగా రంగు అంటుకుంటుంది. అలాంటి ఫిర్యాదులను అధికారులు ఖాతరు చేయట్లేదు.

జీహెచ్ఎంసీలోని పలువురు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు లంచావతారం ఎత్తారు. హోటళ్లు, తోపుడు బండ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, జనరల్ స్టోర్లు, ఇతరత్రా కేంద్రాల్లో వసూళ్లకు పాల్పడుతున్నారు. ఎంతగా అంటే.. లంచం ఇచ్చిన వ్యాపారులు.. ఏం చేసినా పట్టించుకోవట్లేదు. ఇటీవల వెలుగుచూసిన పలు ఘటనలు అధికారులు బరితెగిస్తున్నారు అనేందుకు అద్దం పడుతున్నాయి. కుత్బుల్లాపూర్‌లోని ఓ హోటల్‌లో కనిపించిన హానికర పెరుగు, మల్కాజిగిరిలో గుర్తించిన సాస్ వంటి ఆహార పదార్థాలను ప్రయోగశాలకు పంపకుండా.. సంబంధిత అధికారులు యజమానుల నుంచి ముడుపులు తీసుకున్నారనే విమర్శలు ఉన్నాయి. తనిఖీల్లో గుర్తించే గడువు తీరిన వస్తువులను, క్యాన్సర్‌కు కారణమయ్యే రంగులు వినియోగాన్ని, ఇతర అనారోగ్యాలకు దారి తీసే ఆహార పదార్థాలను.. అక్రమార్జనకు వాడుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనలు వసూళ్లకేనా..

ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సుతో అవసరం లేని వ్యాపారులను కొందరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు. సికింద్రాబాద్, కోఠి, అబిడ్స్ ప్రాంతాల్లో ఇటీవల వసూళ్ల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఒక్కో వ్యాపారి వద్ద రూ.2 వేల నుంచి రూ.10 వేల మేర వసూలు చేస్తున్నారు.

హోటళ్లు, బేకరీలు, ముడిసరకు తయారీ కేంద్రాలు, ఆహార పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టినప్పుడు.. అక్కడ దొరికే హానికర వస్తువులు అవినీతి అధికారులకు లక్ష్యం అవుతున్నాయి. వాటిని ప్రయోగశాలకు పంపిస్తామంటూ యజమానిని బెదిరించి బేరం కుదుర్చుకోవడం మామూలుగా మారిందనే విమర్శలు వస్తున్నాయి.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో వాడే కొన్ని టమోట, చిల్లీసాస్ కల్తీవని తేలినా కొందరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోకుండా వసూళ్లకు పాల్పడుతున్నారు.

# ఆ భూములు ఏమాయె!



హైదరాబాద్ : రాజధాని పరిసర జిల్లాల్లో జరిగిన భూ ఆక్రమణల పర్వాన్ని వెలికితీయాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. ప్రధానంగా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రూ.వేల కోట్ల విలువైన సర్కారు స్థలాలు చేతులు మారాయన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. రెండు జిల్లాల్లో ప్రభుత్వానికి దాదాపు పదివేల ఎకరాల వరకు భూములుండేవి. అసైన్డు భూములు కూడా వేల ఎకరాల్లోనే ఉన్నాయి. నిషేధిత జాబితాలో ఉన్న వీటిని తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేశారు. కొన్ని మండలాల్లో రెవెన్యూ అధికారుల తోడ్పాటుతో నిషేధిత జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్ చేశారు. ఇలా ఒక్క శంషాబాద్ మండలంలోనే దాదాపు 800 ఎకరాల వరకు మాయం చేశారని తెలిసింది. శేరిలింగంపల్లితోపాటు ఇతర మండలాల్లోనూ ఇదే బాగోతం. వీటి వెనుక కొంతమంది ప్రజాప్రతినిధులు ఉన్నారు. ఎన్నికల సమయంలో కొందరు అధికారులు రంగారెడ్డి జిల్లాలో అక్టోబర్, నవంబర్ నెలల్లో 98 ఫైళ్లకు సంబంధించి ధరణిలో లావాదేవీలు నిర్వహించారు. కలెక్టర్ దగ్గర దీనికి సంబంధించి కీ ఉండగానే ఈవ్యవహారం చోటుచేసుకుంది. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో కలెక్టర్ భారతిహొలికేరిపై బదిలీవేటు వేసింది. ఇప్పుడు దీనిపై సమగ్ర విచారణ మొదలుపెట్టింది. అన్యాక్రాంతమైన సర్కారు భూములపై కూడా విచారణ జరగనుందని అధికావర్గాలు తెలిపాయి.

వెలుగులోకి వచ్చిన బాగోతాలు ఇవీ!

ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్, కందుకూర్ మండలాల్లో భూదాన్ ఉద్యమం కింద 16,369 ఎకరాలను పేదలకు దశాబ్దాల క్రితం ఇచ్చారు. వీటిని ఆక్రమించుకుంటున్నారన్న ఫిర్యాదులు రావడంతో ఆరేళ్ల క్రితం విచారణకు ఆదేశించగా.. 4800 ఎకరాలకు సంబంధించిన రికార్డులు లేవు. ఈ భూములపై సీఐడీ అధికారులు విచారణ చేస్తున్నారు.

కందుకూరు, యాచారం మండలాల్లో ఆరేళ్ల క్రితం ఫార్మాసిటీ ప్రకటన రాగానే కొందరు అక్రమార్కులు ప్రభుత్వ భూములను తమవిగా పేర్కొన్నారు. 10 ఎకరాలకు తప్పుడు పత్రాలు సృష్టించి ఎకరా రూ.12 కోట్లకు విక్రయించారు. కొన్నవారు రుణం కోసం వెళ్లగా ఈ బాగోతం బయటపడింది. 8మందిని పోలీసులు అప్పట్లో అరెస్ట్ చేశారు.

మహేశ్వరం మండలంలో అటవీశాఖకు చెందిన 350 ఎకరాలకు పైగా భూములను కొందరు వ్యక్తులు ఆక్రమించారు. దీని విలువ సుమారు రూ.1500 కోట్లు. కోర్టును ఆశ్రయించి వారు సొంతం చేసుకునే ప్రయత్నాలు చేస్తుండగా.. అటవీశాఖ అధికారులు ఇటీవలే హైకోర్టును ఆశ్రయించారు.

శేరిలింగంపల్లి మండలంగోపన్‌పల్లి, ఖాజాగూడాలోని 38 ఎకరాల ప్రభుత్వ భూములు తమవే అంటూ కొందరు కోర్టును ఆశ్రయించారు. కిందిస్థాయి అధికారులు ప్రభుత్వ భూములేనంటూ ఉత్తర్వులు జారీచేసినా... రెవెన్యూ ఉన్నతాధికారుల సాయంతో వాటిని సొంతం చేసుకున్నారు.


గోపన్‌పల్లిలోని సర్వే నంబర్ 36లో రూ.150 కోట్ల విలువైన మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని చెన్నైకి చెందిన ఓ రియల్ సంస్థ ఆక్రమించి ఓ జాతీయబ్యాంకులో తనఖా ఉంచి రూ.కోట్లలో రుణం తీసుకుని చెల్లించలేదు. దీనిపై గతేడాది రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# పతంగుల సంరం.. కావొద్దు విషాదం

హైదరాబాద్: చైనా మాంజా పంజా విసరడానికి సిద్ధమవుతోంది. వాహనదారుల గొంతులు తెగిపోతున్నా.. అధికారులు తనిఖీలు చేపట్టడంలేదు. నిషేధం ఉన్న దీన్ని విక్రయించొద్దంటూ ప్రకటనలు జారీ చేసి చేతులు దులుపుకోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నారు. ఏటా పది కంటే ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల వైద్యులు చెబుతున్నారు. నాగోలు పైవంతెనపై వెళ్తున్న వాహనదారుడు, చిన్నారి గొంతుకలకు మాంజా చిక్కుకొని రక్తస్రావమైన ఘటనను నగరవాసులు మర్చిపోలేదు. పక్షులకు కూడా ఇది మరణశాసనంగా మారుతోంది. గాలిపటాలు ఎగురవేసేటప్పుడు ఎత్తైన భవనం నుంచి పడిపోవడం, విద్యుదాఘాతంతో గాయాలపాలైన ఘటనలు ఏటా జరుగుతున్నాయి. వ్యాపారం ఎక్కడెక్కడంటే.. బేగంబజార్, అబిడ్స్, పాతనగరం ప్రాంతాల్లో మాంజా వ్యాపారం ఎక్కువగా జరుగుతుంది. డిసెంబర్‌లో దిల్లీ, హరియాణా నుంచి ఈ సరకును తీసుకొస్తున్న వ్యాపారులు గోదాముల్లో దాచిపెడుతున్నారు. దుకాణాలు ఏర్పాటు చేసిన తర్వాత తెలిసిన వారికి చైనా మాంజాను విక్రయిస్తున్నారు. పండగ రోజుల్లో తనిఖీలు ఉండవని సంక్రాంతికి ముందు, తర్వాత రోజు విక్రయాలు సాగించడం పరిపాటిగా మారింది. గత ఏడాది రాచకొండ పోలీసులు చైనా మాంజా విక్రయిస్తున్న 65 మందిపై కేసులు నమోదు చేశారు.

మాంజా తయారు చేస్తారిలా..

సాధారణ దారాలతో పోలిస్తే పతంగులు ఎగరేసేందుకు చైనామాంజా సౌలభ్యంగా ఉంటుంది. దీన్ని స్థానికంగానే తయారు చేస్తున్నారు. సింథటిక్ దారానికి గాజు పొడి, కొన్ని రసాయనాలు కలిపి తయారు



చేస్తారు. ఇది చాలా పదునుగా ఉంటుంది. పక్షులు, మనుషులకు ప్రమాదం పొంచి ఉండటంతో కేంద్ర ప్రభుత్వం దీనిని నిషేధించింది.

జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి..

బహుళ అంతస్తుల భవనాలపై ఉండే నీళ్ల ట్యాంకులపై, ప్రహరీలు లేని భవనాల అంచుల వద్ద పతంగులు ఎగురవేసేటప్పుడు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. రహదారుల పక్కన, వంతెనలపై వాటిని ఎగురవేయడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతుంటారు. విద్యుత్తు తీగలకు చిక్కుకున్న వాటిని తీసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యే ఆస్కారం ఉంది. గుట్టలు, కొండలు, చెట్ల వద్ద ఎగురవేయడం వల్ల పక్షుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది.

# ద్రవరూపం.. వినియోగం అధమం

వికారాబాద్ : పంటల అధిక దిగుబడులతోపాటు పెట్టిన పెట్టుబడికి ప్రతిఫలం రావాలనేది అన్నదాతల ఆలోచన. ఈ క్రమంలో పైర్లకు యూరియా, ఇతర రసాయన ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. అధిక యూరియా వినియోగంతో తెగుళ్ల సోకడంతోపాటు భూసారం దెబ్బతింటోంది. ఈ నేపథ్యంలో దశలవారీగా ఎరువుల వినియోగాన్ని నియంత్రించడానికి ప్రభుత్వాలు సంస్కరణలు చేపట్టాయి. గుళికల రూపంలో వినియోగించే ఎరువు స్థానంలో ద్రవరూప(నానో) యూరియాను అందుబాటులోకి తీసుకొచ్చాయి. రైతులకు సరైన అవగాహన కల్పించకపోవడంతో ఆశించిన స్థాయిలో దాన్ని వినియోగించడం లేదు.

ఇదీ పరిస్థితి..ఏటికేడు ఎరువుల వినియోగం పెరుగుతోంది. రైతులు అధికంగా పత్తి, కంది, వరి, మొక్కజొన్న, ఇతర కూరగాయల పంటలకు మిగతా రసాయనాల కంటే అధికంగా యూరియానే వాడుతున్నారు. యాసంగిలోనూ వరి, మొక్కజొన్న, వేరుశనగ, కూరగాయల పంటలకు యూరియా వినియోగం అధికంగా ఉంది. పంట ఎదుగుదల, దిగుబడులు అధికంగా ఉండాలనే లక్ష్యంతో విచ్చలవిడిగా చల్లుతున్నారు. ఈ



చర్యతో పత్తి, వరి, మొక్కజొన్న, కూరగాయల పంటల్లో తెగుళ్ల బెడద అధికమవుతోంది. వాటిని నియంత్రించేందుకు క్రిమిసంహారక మందులను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో రైతుపై భారం పడడంతోపాటు నేల నిస్సారమవుతోంది. అధిక యూరియా వద్దంటూ వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నా అన్నదాతలు పట్టించుకోవడం లేదు. ద్రవరూపంలో దొరుకుతున్నా ఘనానికే మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత యాసంగిలో జిల్లాలో 9,363 మెట్రిక్ టన్నుల గుళికల యూరియా అవసరముంటుందని అధికారులు అంచనా వేసి అందుబాటులో ఉంచారు.

వృథా ఎక్కువ..గుళికల రూపంలో ఉన్న యూరియాను చల్లడం ద్వారా పంటలకు అందేది తక్కువ.. వృథా ఎక్కువ. విపణిలో 50 కిలోల యూరియా బస్తా ధర రూ.268. కూలీల అవసరం లేకుండా నేరుగా రైతులే దీన్ని చల్లుకుంటారు. రవాణా భారం ఎక్కువ. అదే ద్రవరూపంలో ఉండే నానో యూరియా అర లీటరు ధర రూ.250 ఉంది. ఇది నేరుగా మొక్కలకు పిచికారీ చేయడంతో ఎక్కువ ఫలితం ఉంటుంది. భూసారం దెబ్బతినదు.

అవగాహన కల్పిస్తున్నాం..- గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి జిల్లాలో నానో యూరియా విపణిలో 1500 లీటర్లు అందుబాటులో ఉంది. గుళికల యూరియా కంటే ద్రవరూపంలో ఉండే నానో యూరియా ఎంతో మేలు. మొక్కపై ద్రవరూపంలో సమపాళ్లలో పడి నత్రజని సక్రమంగా అందుతుంది. దీన్ని సులువుగా వినియోగించుకోవచ్చు. ఈ విషయమై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

# పక్కదారి పట్టిన రాయితీ వాహనాలు

కరీంనగర్ : జిల్లాలో గుడ్లు-మాంసాహారం చికెన్ ఫాస్ట్ ఫుడ్‌లాగే చేపల ద్వారా పలు రకాల ఫాస్ట్‌ఫుడ్ ఆహారం వంటివి అందుబాటులో ఉండేందుకు మొబైల్ ఫిష్ ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న విధానం హైదరాబాద్‌లో అమలవుతోంది. జిల్లాలో కూడా అమలు చేసేందుకు ప్రభుత్వం రాయితీ వాహనాలు సమకూర్చింది. కానీ అవి పక్కదారి పడుతున్నాయి. 50 శాతం రాయితీపై వాహనాలు ఇవ్వడమే కాకుండా ఫిష్ ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు ఏర్పాటుకు తగిన శిక్షణ ఇప్పించింది. కరీంనగర్ జిల్లా పరిధిలో నాలుగు గ్రూప్‌లకు రూ.పది లక్షల విలువ చేసే వాహనాలు సమకూ ర్చారు. మొబైల్ ఫిష్ అవుట్ లెట్ సెంటర్ స్కీం కింద వాహనాలిలచ్చి ఆరు నెలలకు పైగా కావస్తుంది. ఇప్పటి వరకు ఆ కేంద్రాలు ఏర్పాటు కాలేదు.



ఏర్పాటులో నిర్లక్ష్యం...

జిల్లాలో చేపలు నిరంతరం అందుబాటులో ఉంటాయి. రెండు కోట్లకు పైగా పలు రకాల చేపలు పెంచేందుకు ఉచితంగా విత్తనాలు సరఫరా చేశారు. 25 లక్షలకు పైగా రొయ్య పిల్లలను 908 చెరువులు దిగువ మానేరు జలాశయాలలో వీటిని పెంచి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. కేజ్ కల్చర్ ద్వారా తిలాపియా చేపలు ఉత్పత్తి చేస్తున్నారు. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. నిరంతరం అందుబాటులో ఉండే చేపల ద్వారా మొబైల్ ఫిష్ ఫుడ్ అవుట్‌లెట్లు ఏర్పాటు చేయడంలో అధికారులు ఏమి పట్టించుకోవడం లేదు. ఇటీవల మత్స్య శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన ఈ అంశంపై సమీక్షించి కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న కలెక్టర్ ఆదేశాలు ఏ మేరకు అమలవుతాయో చూడాలి. మిద్దెపైన కేంద్రం..వాహనానికి అమర్చిన అవుట్ లెట్ డబ్బాను తొలగించి మిద్దెపైకి చేర్చారు. వాహనాన్ని ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నారు. నాలుగు గ్రూప్‌లకు కాకుండా మరిన్ని గ్రూపులకు రాయితీ వాహనాలు ఇవ్వాలని అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఇది ఇలా ఉండగా జిల్లా కేంద్రమైన కరీంనగర్‌తోపాటు మున్సిపల్ కేంద్రాలలో కొందరు నిరుద్యోగులు తోపుడు బళ్లపై ఫిష్ ఫ్రై చేసి అక్కడక్కడ విక్రయిస్తున్నారు. మద్యం దుకాణాలకు దూరంగా ఇవి కనిపిస్తుంటాయి. మొబైల్ కేంద్రాల ఏర్పాటుకు అధికారులు సెంటర్లు గుర్తించి వాటిని ప్రారంభిస్తే ఉపయోగం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. నోటీసులు జారీ చేస్తాం-దేవేందర్, సహాయ సంచాలకులు, మత్స్యశాఖ మొబైల్ ఫిష్ సెంటర్లు ఏర్పాటుకు రాయితీ వాహనాలు తీసుకొని వాటిని నెలకొల్పాలని గ్రూప్‌లకు నోటీసులు జారీ చేసి చర్యలు చేపడతాం. జిల్లా కలెక్టర్ ఆదేశాలు త్వరలో అమలు జరిగేలా చూస్తాం

# క్రీడా మైదానంపై కన్నేశారు

ఆదిలాబాద్ : జిల్లా కేంద్రం పరిధిలోకి వచ్చే మావల మండలం బట్టిసావర్గాం పంచాయతీ పరిధిలో తెలంగాణ పల్లె క్రీడా ప్రాంగణానికి కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఈ పంచాయతీ పరిధిలోకి వచ్చే దుబ్బగూడ గ్రామం పక్కన సర్వే నెం. 72/53లోని 10 గుంటల స్థలాన్ని ఇటీవలే రెవెన్యూ అధికారులు క్రీడాప్రాంగణానికి కేటాయించారు. వాస్తవంగా రెవెన్యూ శాఖ నుంచి అధికారికంగా కేటాయించినట్లు ఉత్తర్వులు వస్తేనే ఆ స్థలం ఆధీనంలోకి తీసుకునే అవకాశం ఉంది. కాకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో ఇక్కడ అదే పద్ధతి అమలవుతోంది. రెవెన్యూ అధికారులు సూచించిన చోటనే ఈ క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నారు.

బోర్డులు పాతినా..దుబ్బగూడ వద్ద స్థలంలో పంచాయతీ తరఫున రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. బోర్డు, ఇతర పరికరాలు ఏర్పాటు చేశారు. పిల్లలు, యువత ఆటలు ఆడేందుకు, వ్యాయామం



చేసుకునేందుకు అంతా సిద్ధం చేశారు. ఇంతలోనే 15 రోజుల కిందట కొందరు ఆ స్థలం తమదంటూ వచ్చి అక్కడున్న బోర్డు, ఇతర పరికరాలను తొలగించారు. సిమెంటు కాంక్రీటుతో ఉన్న బోర్డులన్నీ యంత్రాలతో తొలగించి అక్కడే పడేశారు. అక్కడ స్థలాలకు డిమాండ్ పెరగడంతోనే ఇతరులు కన్నేసినట్లు సమాచారం.

మౌనమేలనో..?

జిల్లా కేంద్రంలోనే దర్జాగా రెవెన్యూ అధికారులు సూచించిన స్థలంలో ఈ తతంగమంతా జరిగినా అధికారులంతా ఎందుకు మౌనంగా ఉంటున్నారో ఎవరికి అర్థం కావడం లేదు. అది ప్రైవేటు వ్యక్తుల స్థలమైతే రెవెన్యూ అధికారులు ఎలా కేటాయిస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రెవెన్యూ అధికారులు మాత్రం ప్రభుత్వ స్థలం కావడంతోనే పంచాయతీకి ఇచ్చినట్లు చెబుతున్నారు. కాకపోతే తొలగించిన వారిపై మాత్రం చర్యలకు వెనుకంజ వేస్తున్నారు.

వ్యవసాయ కళాశాల స్థల ఆక్రమణకు యత్నం

క్రీడా మైదానానికి కేటాయించిన స్థలానికి ఆనుకొనే అదే సర్వే నెం. 72/53లో 3.20 ఎకరాల స్థలాన్ని ఆచార్య జయశంకర్ వ్యవసాయ కళాశాలకు కేటాయించారు. ఈ స్థలం తమదంటూ గతంలో కొందరు పత్రాలతో రావడం వివాదంగా మారింది. ఇప్పటికీ దీనిపై పంచాయతీ తేలలేదు. ఎవరూ నోరు మెదపడం లేదు. ఈ నేపథ్యంలోనే అదేచోట బోర్డుల తొలగింపు వివాదం తెరపైకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విషయమై మావల పంచాయతీ అధికారి లక్ష్మణ్‌తో మాట్లాడుతూ క్రీడా ప్రాంగణానికి కేటాయించి స్థలంలో బోర్డుల తొలగింపు విషయాన్ని స్థానిక సంస్థల అదనపు పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లాం. అది ప్రభుత్వ స్థలమేనని బోర్డులు యథావిధిగా ఏర్పాటుచేయాలని ఆయన ఆదేశించారు. ఇదే విషయంపై పంచాయతీ తరఫున మావల పోలీసులకు సైతం ఫిర్యాదు చేయించాం.

# అక్కడ ముగ్గురు.. ఇక్కడ ఇద్దరు

తాంసి : ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీటిని కాల్వల ద్వారా ఆయకట్టు రైతులకు సాఫీగా నీరందించేందుకు సిబ్బందిని నియమిస్తామని రాష్ట్ర ప్రభుత్వం 2021లో ప్రకటించింది. కానీ ఇంతవరకు సిబ్బందిని నియమించలేదు. జిల్లాలో ప్రధానమైన సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టులు నిండి సాగుకు నీరందించే సమయం ఆసన్నమైనా లష్కర్లు (నీరటీలు), గేట్‌మెన్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ల జాడ కనిపించడం లేదు. ఇద్దరు, ముగ్గురే ఉండటంతో నిర్వహణ ఇబ్బందిగా ఉంది. జిల్లాలో ప్రధానంగా సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టుల ద్వారా 32 వేలకు పైగా ఎకరాలకు సాగు నీరందుతుండగా, జూనియర్ ఇంజినీరు తప్ప మిగతా సిబ్బంది లేక పర్యవేక్షణ కొరవడి నీరు వృథా అవుతోంది. సాత్నాల జలాశయం ద్వారా



జైనథ్, బేల, ఆదిలాబాద్ మండలాల్లోని 24వేల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తుండగా.. మత్తడివాగు ప్రాజెక్టు ద్వారా తాంసి, భీంపూర్, ఆదిలాబాద్ మండలాల్లోని 8500 ఎకరాలకు సాగు నీరందుతోంది. ప్రాజెక్టుతోపాటు కాలువల పర్యవేక్షణకు డీఈ, జేఈలతో పాటు కిందిస్థాయి సిబ్బంది లష్కర్లు, గేట్ ఆపరేటర్లు, వాచ్‌మెన్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఎలక్ట్రీషియన్ల అవసరం ఉంది. కానీ సాత్నాలకు ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్, లష్కరు ఉండగా.. మత్తడివాగు ప్రాజెక్టుకు ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ మాత్రమే ఉన్నారు. కిందిస్థాయి సిబ్బంది ఒక్కరు కూడా లేరు. కొన్నేళ్లుగా ప్రభుత్వం భర్తీ చేయక కాలువల ద్వారా నీటిని విడుదల చేసే వారు లేక రైతులు తమ ఇష్టానుసారంగా నీటిని వినియోగించుకోవాల్సి వస్తోంది. గతంలో లష్కర్లు ఆయకట్టుకు నీటిని విడుదల చేసే సమయంలో కాలువలపై పర్యవేక్షణ ఉండటంతో రైతులు అవసరం మేర నీటిని వినియోగించుకునేలా చూసేవారు. కాలువల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, పూడికను తొలగించే వారు. కాలువలకు గండ్లు పడకుండా పర్యవేక్షిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడుపై అధికారులకు తెలియజేసేందుకు వీలుండేది. ఉద్యోగ విరమణ పొందిన వీరి స్థానంలో ప్రభుత్వం కిందిస్థాయి సిబ్బంది నియమించకపోవడంతో కాలువలకు గండ్లు, పూడిక, పిచ్చిమొక్కలు పెరిగి సాగునీరు వృథా అవుతోంది. ప్రాజెక్టులోకి వరద నీరొచ్చి చేరే సమయంలో గేట్లు ఎత్తడం, తర్వాత మూసివేయడానికి ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు లేక అనుభవం అంతగా లేని స్థానికులతో పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి ఉంది.

ప్రస్తుతం ప్రాజెక్టులు నిండా నీటితో కళకళలాడుతున్నాయి. సాగుకు నీటిని చివరి ఆయకట్టు వరకు సక్రమంగా నీరందేందుకు ప్రభుత్వం తగిన సిబ్బందిని నియమించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ పరిశీలనలో ఉంది : శ్రీనివాస్, డీఈ నీటిపారుదల శాఖ

లష్కర్లు, గేటు ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లను నియమించాలని ప్రభుత్వానికి నివేదించాం. సిబ్బంది నియామకం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ప్రస్తుతం ఉన్నవారితో ఆయకట్టుకు సక్రమంగా నీరందించే చర్యలు తీసుకుంటున్నాం.

# నిబంధనలు నామమాత్రం.. దోపిడే అసలు సూత్రం



చెన్నూరు : చెన్నూరు మండలంలో చెడిపోయిన నియంత్రికను తొలగించి మరమ్మతు కేంద్రానికి తరలించేందుకు రైతులు పడుతున్న కష్టాలివి. అవి కాలిపోయిన ప్రతీసారి రైతులే కిందకు దించుకొని భుజాలపై మోసుకుంటూ పంట పొలాలు దాటి.. వాహనం మాట్లాడుకొని మరమ్మతు కేంద్రాలకు తరలిస్తుండటం ఈ ప్రాంతంలో రివాజుగా మారింది. విద్యుత్తు నియంత్రికలు కాలిపోతే వాటి మరమ్మతుల కోసం రైతులకు భారం తప్పడం లేదు. నిబంధనల ప్రకారం నిర్దేశిత మొత్తానికి డీడీ కడితే నియంత్రిక ఇవ్వాలి. అది కాలిపోతే విద్యుత్తు సంస్థ వాహనం ఏర్పాటు చేసి దాన్ని మరమ్మతు కేంద్రానికి, మరమ్మతు చేశాక సంబంధిత గ్రామానికి చేర్చాలి. మరమ్మతు పూర్తయి బిగించే వరకు కాలిపోయినచోట రోలింగ్ (ప్రత్యామ్నాయ) నియంత్రిక అమర్చాల్సి ఉన్నా.. ఎక్కడా ఇలాంటి చర్యలు తీసుకోవడం లేదు. నియంత్రికలు కాలిపోతే రైతులు వాటిని భుజాలపై లేదా ఎడ్లబండ్లపై మరమ్మతుల కోసం తీసుకురావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, లక్సెట్టిపేట, బెల్లంపల్లి, జైపూర్ గ్రామాల్లో నియంత్రికల మరమ్మతు కేంద్రాలున్నాయి. వివిధ సామర్థ్యాలు గల నియంత్రికలు 13 వేల వరకు ఉన్నాయి. సుమారు 470 రోలింగ్ నియంత్రికలున్నాయి.

వర్షాల కారణంగా..

భారీ వర్షాల కారణంగా గోదావరి పరివాహక ప్రాంతాల్లో పంట పొలాలన్నీ నీటమునిగాయి. ఈ క్రమంలో పంటపొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రికలు సైతం నేలకొరిగి నీటి మునిగి చెడిపోయాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రైతులు తిరిగి విత్తులు నాటేందుకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలో చెడిపోయిన నియంత్రికలను బాగు చేయించేందుకు మరమమ్మతు కేంద్రాల వద్దకు పరుగులు తీస్తున్నారు. నియంత్రికలను మరమ్మతు కేంద్రానికి చేర్చడానికి విద్యుత్తు సంస్థ జిల్లా వ్యాప్తంగా ఒకే వాహనాన్ని ఏర్పాటు చేసింది. సబ్ డివిజన్ పరిధిలో ఏడీఈలకు ఇచ్చిన వాహనాలు సైతం వీటిని చేర్చేందుకు వినియోగించాల్సి ఉంది. ఆ వాహనాలతో అధికారుల పర్యవేక్షణ, అన్ని చోట్లకు వెళ్లి నియంత్రికలను తీసుకరావడం ఇబ్బందిగా మారుతోంది. దీంతో చెడిపోయిన వాటిని రైతులే ప్రైవేటు వాహనం మాట్లాడుకొని, లేదా ఎడ్లబండ్లలో ఎక్కించుకొని కేంద్రానికి తీసుకొచ్చి తిరిగి మరమ్మతులు పూర్తి అయ్యాక వాటిని తీసుకవెళ్తున్నారు.

కేంద్రాల వద్ద..ఒక్కోదాని మరమ్మతుకు నాలుగైదు రోజులు పడుతోంది. ఆ సమయంలో ప్రత్యామ్నాయంగా నియంత్రిక ఏర్పాటు చేయకపోవడంతో పంటలు నాశనమవుతున్నాయి. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుంటూ గుత్తేదార్లు, అధికారులు అనధికారికంగా నియంత్రికలు ఏర్పాటు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్రాల వద్ద సైతం ఒక్కోదాని మరమ్మతుకు రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల చెన్నూరులోని మరమ్మతు కేంద్రం వద్ద ఓ రైతు అక్కడి ప్రైవేటు సిబ్బందికి డబ్బులు ఇస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు జరిగిన ఘటనపై అధికారులు విచారణ జరిపి చర్యలకు సైతం ఉపక్రమించినట్లు తెలుస్తోంది.


మరమ్మతుల కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు

నియంత్రికల మరమ్మతులకు రైతులు ఎవరికి డబ్బులు ఇవ్వొద్దు నిబంధనల ప్రకారం ఉచితంగా మరమ్మతులు చేసి ఇస్తున్నాం. కేటాయించిన వాహనాల ద్వారా ఒకేసారి అన్ని ప్రాంతాల్లో నియంత్రికలను చేరవేయడం కష్టంగా ఉండటంతో రైతులకు కొంత ఇబ్బందులు జరుగుతున్న మాట వాస్తవం. మరమ్మతులకు ఎవరైనా డబ్బులు అడిగితే మా దృష్టికి తీసుకరావొచ్చు. – కిరణ్, డిస్కం ఎమ్ఆర్‌టీ ఏడీఈ

కాలం చెల్లిన నియంత్రికలు మరమ్మతు కేంద్రాల వద్ద ఇలా కనిపిస్తుంటాయి. అయితే ఇలాంటి వాటిని స్క్రాప్ కింద విక్రయించాల్సి ఉన్నప్పటికీ పంపించడం లేదు. కేంద్రాల వద్ద పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది పలువురు అధికారుల అండదండలతో ఇలాంటి వాటికి మరమ్మతులు చేయించి ఇతరులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

మరమ్మతులకు ఎవ్వరికీ డబ్బులు చెల్లించొద్దంటూ కేంద్రాల వద్ద రాసినప్పటికీ ఇవి పలుచోట్ల అమలు కావడం లేదు. ఇది కేవలం రాతలకు మాత్రమే పరిమితమవుతోంది. తీసుకొచ్చిన నియంత్రికను వాహనం నుంచి దించేందుకు, మరో నియంత్రికను ఎక్కించేందుకు సైతం వినియోగదారులు అక్కడి సిబ్బందికి ఎంతోకొంత ముట్టచెప్పాల్సిన పరిస్థితి ఉంది.

# తేనె పట్టు.. ఆదాయానికి మెట్టు



తాంసి :మహిళలు ఇప్పటి వరకు స్వయం సహాయక సంఘాలు ఏర్పడి బ్యాంకుల నుంచి పొందిన రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఉపాధి పొందుతూ వస్తున్నారు. గ్రామీణ పాంతాల మహిళలు స్వయం ఉపాధి పొందే అవకాశాలు తక్కువగా ఉండటంతో తీసుకున్న రుణాలను వ్యవసాయానికి పెట్టుబడిగా వాడుకుంటున్నారు. దీంతో వారు ఆర్థికంగా అభివృద్ధి చెందలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల మహిళలకు అక్కడ లభించే వనరులతో స్వయం ఉపాధి పొందేలా అవకాశాలు కల్పించేందుకు గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్డీఏ), సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) ప్రత్యేక దృష్టిసారించింది. అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉన్న గ్రామాల్లో తేనెటీగల పెంపకం చేపట్టి స్వయం సహాయక సంఘాలను భాగస్వాముల్ని చేసి ఆర్థికాభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టింది.

మొదటి విడతగా అయిదు మండలాల్లో

తేనెటీగల పెంపకం, ఉత్పత్తి చేపట్టేందుకు మొదటి విడతగా వాంకిడి, తిర్యాణి, సిర్పూర్(టి), ఆసిఫాబాద్, జైనూర్ మండలాల్లోని ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేశారు. ఎంపిక చేసిన గ్రామాల్లో గత మే, జూన్‌లో మండల సమాఖ్యాల ఆధ్వర్యంలో సభ్యులకు తేనెటీగల పెంపకంపై శిక్షణనిచ్చారు. శాస్త్రీయ పద్ధతుల్లో తేనెటీగలను పెంచడం, తేనెను సేకరించే విధానాలపై హైదరాబాద్ నుంచి వచ్చిన శిక్షకులు శిక్షణనిచ్చారు. త్వరలో శిక్షణ పొందిన సభ్యులకు తేనెటీగల పెంపకం కోసం పెట్టెలను సరఫరా చేయనున్నారు. వాటిని తమ పంటపొలాల్లో, అనుకూలంగా ఉన్న చోట ఏర్పాటు చేసి తేనె ఉత్పత్తి చేస్తారు. ఇలా ఉత్పత్తి చేసిన తేనెను మండల సమాఖ్యాల ఆధ్వర్యంలో సేకరించి బహిరంగ మార్కెట్‌లోకి తీసుకువస్తారు.

ట్రయల్‌రన్‌గా.. తేనె సేకరణ

ఓ వైపు శిక్షణ కార్యక్రమం చేపడుతూనే గ్రామీణ ప్రాంతాల గిరిజనుల నుంచి మండల సమాఖ్యల ఆధ్వర్యంలో తేనె సేకరించారు. వాంకిడికి చెందిన గిరిజన మహిళలు సేకరించిన 1233 కిలోల తేనెను మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసి వారికి నమ్మకం కలిగించారు. త్వరలో మండల సమాఖ్యల ఆధ్వర్యంలో యంత్రాలను కొనుగోలు చేసి తేనెను శుద్ధి చేసి బహిరంగా మార్కెట్‌లో విక్రయించనున్నారు.

ఆర్థికంగా ఎదిగేందుకు దోహదం : – మహేష్, ఐకేపీ ఏపీఎం

తేనె టీగల పెంపకం, ఉత్పత్తితో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతుంది. మండలంలో ఎంపిక చేసిన సవ్వాతిలో మొదట విడతగా 31 మంది మహిళా సభ్యులకు శిక్షణనిచ్చాం. వీరికి త్వరలో పెట్టెలను సరఫరా చేయనున్నాం. సభ్యులు ఉత్పత్తి చేసిన తేనెను మండల సమాఖ్య ఆధ్వర్యంలో మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తాం. దాదాపు రూ. 3 లక్షలతో మండల సమాఖ్య ఆధ్వర్యంలో తేనెశుద్ధి చేసే యంత్రాన్ని అందుబాటులోకి తీసుకువస్తాం.

# నిండిన జలవనరులు.. ప్రమాదకరంగా కట్టలు

కంది : మండల పరిధిలోని ఇంద్రకరణ్-ఓడీఎఫ్ పరిధిలోని బతుకమ్మ చెరువుకు గండి పడటంతో నీరంతా దిగువకు వృథాగా ప్రవహించింది. ఇంద్రకరణ్ నుంచి శంకర్‌పల్లికి వెళ్లే ప్రధాన రహదారి కోతకు గురైంది. స్థానిక ఎంపీటీసీ చంద్రి శ్రీనువాస్ పరిశీలించారు. రహదారి మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని అధికారులను కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అందోలు మండల పరిధిలోని పలు చెరువులు, కుంటలు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకున్నాయి. కొన్ని అలుగు పారుతున్నాయి. అందోలు మండలంలోనే పెద్ద చెరువులైన అందోలు, అన్నాసాగర్ చెరువులు నిండు కుండలను తలపిస్తున్నాయి. అలుగులు పారేందుకు సిద్ధంగా ఉన్నాయి.

కూలిన గోదాం గోడస్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోని గోదాం గోడ కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కథనం ప్రచురితమైనా అధికారులు అప్రమత్తం కాలేదు. ఈ గోదాం పక్కనే మార్కెట్ కమిటీ కార్యాలయం ఉంది. ప్రస్తుతం ఈ గోదాంలో ఓ రైస్‌మిల్లుకు చెందిన ధాన్యం నిలువ చేశారు. గోదాం గోడ కూలిపోవడంతో ధాన్యం ఆ బస్తాలను లారీల్లో తరలించారు. మార్కెటింగ్ శాఖ డీఈఈ మాధవరెడ్డి, ఇన్‌ఛార్జి కార్యదర్శి ప్రతాపరుద్రామగౌడ్ పరిశీలించారు. గోదాం నిర్మాణానికి అంచనాలు రూపొంది ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు డీఈఈ మాధవరెడ్డికు తెలిపారు. కట్ట తెగితే.. 11 కాలనీలకు ముప్పుకందిలోని దేవుని చెరువు కట్ట రెండేళ్ల క్రితం తెగింది. నీళ్లన్నీ వృథాగా పారాయి. ఆ తర్వాత చెరవు కట్టను శాశ్వత మరమ్మతు చేయలేదు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేరువు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరింది. కట్టకు బుంగ పడటంతో ప్రమాదకరంగా మారింది. గడ్డి, ఇసుక సంచులతో తాత్కాలిక మరమ్మతు చేసి కట్టను పటిష్ట పరిచారు. మరోసారి భారీ వర్షం కురిస్తే గండిపడే అవకాశం ఉందని రైతులు తెలిపారు. ఈ కట్ట తెగితే మహబూబ్‌సాగర్ చెరువులోకి వరద చేరి దాదాపు 10 కాలనీలు నీట మునుగుతాయి.

# జాతీయ రహదారి.. అవస్థలు ముదిరి..!

మనోహరాబాద్ : అధికారుల సమన్వయ లోపం వాహనదారుల పాలిటశాపంగా మారింది. నిర్ణీత గడువు లోపు పనులు పూర్తికాకపోవడంతో వేలాది మంది వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేప్రాజెక్టులో భాగంగా రామాయపల్లి వద్ద దేశంలో అత్యంత పొడవైన జాతీయ రహదారిపై వంతెన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. రూ. 100కోట్లతో చేపట్టిన పనులను మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. మొదటగా సర్వీస్ రోడ్డును పూర్తి చేయగా రైల్వే పట్టాలను ఏడాది క్రితం పూర్తి చేశారు. ఈ రెండింటి పై నుంచి 44వ జాతీయ రహదారి నిర్మాణ పనులను చేపడుతున్నారు. గతేడాదే ఈ పనులను పూర్తి కావాల్సి ఉన్నా ఇప్పటి వరకు పూర్తి కాలేదు. దీంతో ప్రస్తుతం సర్వీస్ రోడ్డు మీదుగానే హైదరాబాద్-నిజామాబాద్ వైపు వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు.

వాహనదారులకు, పరీక్షార్థులకు కష్టాలు

ఈ ప్రాజెక్టు నిర్మాణంలో చిన్న సమస్యలు తీవ్ర అంతరాయాన్ని కలిగిస్తున్నాయి. నాలుగేళ్ల కాలంలో వర్షాలు పడినప్పుడల్లా నీరంతా సర్వీస్ రోడ్డులోకి చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం నెలకొంది. చిన్న వర్షం పడితే మనోహరాబాద్ రైల్వేస్టేషన్ నుంచి కిలో మీటర్ల మేర నుంచి వచ్చే నీరు సర్వీస్ రోడ్డులోకి చేరుతుంది. 5 నుంచి 6 గంటలు నిర్విరామంగా వర్షం పడితే 12 గంటల పాటు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ రహదారిపై నిత్యం 10వేలకు పైగా వాహనాలు రాకపోకలు చేస్తున్నాయి. రెండువైపులా ఆరు కిలో మీటర్ల మేర 500 పైగా వాహనాలు నిలిచిపోతున్నాయి. ఈ సమయంలో ఆస్పత్రులు, ఇతర అత్యవసర పని నిమిత్తం వెళ్లే ప్రజలు, పరీక్షలు రాసేందుకు ప్రయాణం చేసే విద్యార్థులు సమయానికి వెళ్లలేక ఒత్తిడికి గురవుతున్నారు. వారం రోజుల క్రితం రాకపోకలు నిలిచిపోవడంతో డైట్ సెట్ రాసేందుకు వెళ్తున్న ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు కేంద్రాలను చేరుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. కొందరు మిస్సయ్యారు. ఈ పనులు నెమ్మదిగా సాగడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు.

వరద తగినట్టు లేని కాలువ

రామాయపల్లి వంతెన నిర్మాణం జరిగిన చోట స్థలం ఒంపుగా ఉండటంతో మనోహరాబాద్‌తోపాటు పలు గ్రామాలతోపాటు పట్టాల వెంట కురిసిన వర్షం నీరు అండర్‌పాస్‌లోకి చేరుతున్నాయి. దీంతోపాటు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కాల్వలు సైతం తగిన పరిమాణంలో లేకపోవడంతో త్వరగా వెళ్లడం లేదు. అండర్‌పాస్‌లోకి వెళ్లే నీరు రామాయపల్లి గ్రామ శివారు నుంచి సమీపంలోని చెరువులోకి వెళ్లేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ కాల్వల నిర్మాణానికి రైతులు సహకరించటం లేదు. వంతెన నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

ప్రత్యామ్నాయం ఇంకెన్నాళ్లు?

రామాయపల్లి వంతెనలో నిలిచే నీరు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అధికారులను అప్రమత్తం చేస్తోంది. ఇక్కడ రాకపోకలు నిలవగానే సికింద్రాబాద్ బోయిన్‌పల్లి వద్ద పోలీసులు వాహనదారులను అప్రమత్తం చేస్తున్నారు. కొన్ని వాహనాలను మేడ్చల్, గజ్వేల్, తూప్రాన్ మీదుగా నిజామాబాద్ వెళ్లేలా చొరవ తీసుకుంటున్నారు. మరికొన్నిటిని దండుపల్లి, మనోహరాబాద్ మీదుగా తూప్రాన్ వైపు వచ్చేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ రహదారులు మీదుగానే నిజామాబాద్ వైపు వచ్చే వాహనదారులను హైదరాబాద్ వైపు మళ్లిస్తున్నారు. రహదారిపై వాహనాలకు వెళ్లడానికి అనుకూలంగా ఉందా లేదా అని పక్కాగా సమాచారం తెలుసుకున్న తర్వాతనే ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

త్వరగా పూర్తి చేయాలి– మెట్టు బాలకృష్ణారెడ్డి, తూప్రాన్ పీఏసీఎస్ ఛైర్మన్

రామాయపల్లి వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలి. ప్రధానంగా వర్షం పడితే నీరు నిలిచి వేలాది వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నీరు పోయేందుకు గుర్తించిన స్థలంలో కాల్వ నిర్మాణ పనులు పూర్తి చేయాలి. కొందరు తమ స్వార్థం కోసం అడ్డుపడుతున్నారు.

మోటార్ల సామర్థ్యాన్ని పెంచుతాం– శ్రీనివాస్, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ పీడీ

అధిక వర్షాలు కురిస్తే రామాయపల్లి వంతెనలో నీరు నిండి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భవిష్యత్తులో వర్షం పడితే వెనువెంటనే నీటిని తొలగించేందుకు ప్రస్తుతం ఉన్న మోటార్ల స్థానంలో మరింత సామర్థ్యమున్న మోటార్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం. ఫ్లైఓవర్ వంతెన పనులను వచ్చే ఏడాది మే వరకు పూర్తి చేయాలని గుత్తేదారుకు ఆదేశించాం.

# పాఠశాలకు మేము సైతం..!

మనోహరాబాద్ : ఉపాధ్యాయులు వృత్తి రీత్యా బోధనలో ఉన్నా ప్రవృత్తిరీత్యా తమకిష్టమైన ఇతర పనులు, కళల్లో నైపుణ్యాన్ని పాఠశాలల్లో ప్రదర్శిస్తున్నారు. తమకు పట్టున్న రంగంలో పాఠశాలకు ఇతోధిక సాయం అందిస్తూ సాగుతున్నారు. ఒకవైపు వారికి తృప్తి కలగడమే కాకుండా బడికి ఖర్చు తగ్గిస్తున్నారు. కొందరు బడి గోడలపై విద్యకు సంబంధించిన బొమ్మలు వేస్తున్నారు. ఇంకొందరు పైపులు, తలుపులు, కిటికీలు, బల్లలు మరమ్మతులు చేస్తున్నారు. పర్వదినాలు వచ్చినపుడు విద్యార్థులతో కలిసి అనేక కార్యక్రమాలు చేపడుతూ ఉత్సాహాన్ని నింపుతున్నారు.

చిత్రం.. విద్యార్థికి ప్రయోజనం

మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన సత్యనారాయణ ఎస్జీటీ ఉపాధ్యాయుడు. పల్లెగడ్డ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుగా పని చేస్తున్న సమయంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో పాఠశాల మూసివేసి మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల(యూపీఎస్)కు డిప్యూటేషన్ వేశారు. 2019–22 జూన్ వరకు తీరిక దొరికినప్పుడు పాఠశాల గోడలు, దిమ్మెలపై విద్యార్థులకు ఉపయోగపడే బొమ్మలు, గణాంకాలు, గుణింతాలు, పర్యావరణ పరిరక్షణ చిత్రాలు, దినచర్య, చోటాభీమ్ లాంటి చిత్రాలు అందంగా గీశారు. చిన్నపుడు ముస్లాపూర్ జడ్పీ బడిలో డ్రాయింగ్ టీచర్ ఆనంద్ ప్రోత్సాహం నేడు ఉపయోగపడుతోందని సత్యనారాయణ సంతోషం వ్యక్తం చేశారు.

ఇతోధిక సాయంపెద్దశంకరంపేట మండలం ఆరెపల్లి ప్రాథమిక పాఠశాలలో బాయికాడి శ్రీనివాస్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ధరలు పెరగడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఎవరూ రావటం లేదు. మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా ఆయన వండుతున్నారు. ప్రస్తుతం 30 మంది విద్యార్థులున్నారు. ఒక్కరే ఉపాధ్యాయుడు. కామారెడ్డి జిల్లా గండిపేట్ గ్రామానికి చెందిన విద్యాసాగర్.. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం పత్తేపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇక్కడ ముగ్గురు ఉన్నారు. విద్యాసాగర్‌కి బొమ్మలేయడంలో ఆసక్తి. సొంత డబ్బులతో పాఠశాల గోడలపై ఖాళీ సమయంలో వివిధ రకాల బొమ్మలు గీసి మనోహరంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం పత్తేపూర్‌లో 73 మంది విద్యార్థులున్నారు. శివ్వంపేట మండలంలో ఫిజికల్ డైరక్టర్‌గా చేస్తున్న ఆంజనేయులు పెయింటింగ్ ఆసక్తితో గోమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కళాత్మకంగా విద్యార్థులకు ఉపయోగపడే చిత్రాలు గీస్తున్నారు. ఈయన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇక్కడ కూడా వివిధ రకాల ఛార్టులు వేస్తున్నారు.

# హనీరోజ్ అదరగొట్టిందిగా

2023 సంక్రాంతి బరిలో విడుదలైన వీర సింహారెడ్డి చిత్రంలో నటించింది హనీరోజ్. ఈ సినిమా చక్కని విజయం అందుకుంది. కొన్నేళ్ల క్రితమే తెలుగు పరిశ్రమకు పరిచయమైన ఈ బ్యూటీకి ఇది ఒక సువర్ణ అవకాశంగా మారింది. బాలయ్య సినిమాతో సక్సెస్ తన దరికి చేరింది. ఆ తర్వాత టాలీవుడ్ సర్కిల్స్ లో హనీ వైబ్స్ గురించి తెలిసిందే. ఓ వైపు గ్లామరస్ పాత్రలతో మరోవైపు షాపుల రిబన్ కటింగులు, షో రూమ్ లాంచ్ లతో బాగానే ఆర్జించిన హనీరోజ్.. పలు లేడీ ఓరియెంటెడ్ చిత్రాలకు సంతకాలు చేసింది. గత సంవత్సరం హనీరోజ్ కి బాగా కలిసొచ్చింది. కొత్త సంవత్సరంలో తన స్టార్ డమ్ ని మరో స్థాయికి తీసుకెళ్లాలని ఆశపడుతోంది. ఇంతలోనే పాత సంవత్సరానికి భాయ్ చెబుతూ కొత్త సంవత్సరం వైబ్స్ తో అభిమానుల ముందుకు వచ్చింది. తన ఫ్యాన్స్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ స్పెషల్ ఫోటోషూట్ ని ఇన్ స్టాలో షేర్ చేసింది హనీ. మీ అందరికీ అద్భుతమైన 2024 శుభాకాంక్షలు.. అద్భుతాలు చేయండి అని వ్యాఖ్యను జోడించింది. నావీ బ్లూ టైట్



ఫ్రాక్ లో హనీరోజ్ అందచందాలు కుర్రాళ్ల మతులు చెడగొడుతున్నాయి. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. హనీ రోజ్ ప్రధాన పాత్రలో నటించిన రేచెల్ చిత్రీకరణ డిసెంబర్ 20 తో ముగిసింది. కొత్త సంవత్సరంలో ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. తాజా నోట్ లో రేచల్ షూటింగ్ అనుభవం గురించి మాట్లాడింది. ఈ మూవీ చిత్రీకరణ తనకు మరచిపోలేని అధ్యాయం అని పేర్కొంది. తన 18 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో తనకు ఎదురైన అనుభవానికి భిన్నంగా రేచెల్ అనుభవాలు వెంటాడుతున్నాయని కూడా చెప్పింది. ఈ పాన్-ఇండియన్ ప్రాజెక్ట్‌లో అడుగు పెట్టడం ఒక ప్రత్యేకమైన అనుభవం. హీరోయిన్‌గా నా 18 ఏళ్ల కెరీర్‌లో మొదటిసారిగా, రేచల్‌ని అత్యంత ఆకర్షణీయమైన పాత్రగా మార్చిన డైనమిక్ , ప్యాషనేట్ లేడీ డైరెక్టర్ శ్రీమతి ఆనందిని బాలా మార్గదర్శకత్వంలో పని చేయడం నాకు చాలా ఆనందంగా ఉంది. .. అని రాసింది. బాబూరాజ్, కళాభవన్ షాజోన్, జాఫర్ ఇడుక్కి, రాధిక, వందిత, తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

# త్రిష్.. ఈసారి ఏకంగా బడా ఆఫర్

సౌత్ ఇండియాలో హీరోయిన్ గా రెండు దశాబ్దాల కెరియర్ ని పూర్తి చేసుకున్న అందాల భామ త్రిష. ఈ అమ్మడు కెరియర్ ఇక ముగిసిపోయింది అనుకున్న టైంలో మణిరత్నం పొన్నియన్ సెల్వన్ సిరీస్ పడింది. ఈ మూవీ సిరీస్ త్రిష ఇమేజ్ ని మరల అమాంతం పెంచేశాయి. భారీ రెమ్యునరేషన్ డిమాండ్ చేసేంతగా ఆమెకి రేంజ్ పెరిగిపోయింది. ప్రస్తుతం తమిళంలో అజిత్ కి జోడీగా ఒక సినిమాలో నటిస్తోంది. అలాగే కమల్ హాసన్ థగ్స్ లైఫ్ మూవీలో కూడా నటించే ఛాన్స్ అందుకుంది. మణిరత్నం దర్శకత్వంలో ఈ మూవీ తెరకెక్కుతోంది. అలాగే తెలుగులో మెగాస్టార్ చిరంజీవికి జోడీగా విశ్వంభరలో కూడా త్రిషనే హీరోయిన్ గా నటించనున్నట్లు ప్రచారం నడుస్తోంది. మరి ఇందులో వాస్తవం ఎంత అనేది అఫీషియల్ ఎనౌన్స్



చేసేంత వరకు వెయిట్ చేయాల్సిందే. ఇదిలా ఉంటే ఇప్పుడు త్రిష హిందీలో కూడా అవకాశం సొంతం చేసుకుంది. 2010లో త్రిష హిందీలో అక్షయ్ కుమార్ కి జోడీగా కట్టా మీటా సినిమాలో నటించింది. ఆ తరువాత మళ్ళీ అవకాశాలు రాలేదు. 13 ఏళ్ళ తర్వాత హిందీలో మరో క్రేజీ ఆఫర్ సొంతం చేసుకుంది. ఈ సారి ఏకంగా సల్మాన్ ఖాన్ కి నటించబోతోంది. తమిళ్ డైరెక్టర్ విష్ణువర్ధన్ హిందీలో సల్మాన్ ఖాన్ హీరోగా ది బుల్ అనే మూవీ చేస్తున్నారు. ధర్మా ప్రొడక్షన్స్ బ్యానర్ పై కరణ్ జోహార్ ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నారు. మాల్దీవుల తిరుగుబాటును ఆపడానికి 1988 ఆపరేషన్ కాక్టస్ నిర్వహించిన బ్రిగేడియర్ ఫరూక్ బుల్సారా నేతృత్వంలోని భారత పారాట్రూపర్స్ బయోపిక్ గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో ఫరూక్ పాత్రలో సల్మాన్ ఖాన్ కనిపించబోతున్నాడు. అతని భార్యగా త్రిష నటించనుంది.

ఈ పాత్రకి కథలో చాలా ప్రాధాన్యత ఉంటుందని తెలుస్తోంది. శుక్రవారం మూవీ అఫీషియల్ గా లాంచ్ కానుంది. వచ్చే ఏడాది రెగ్యులర్ షూటింగ్ కంప్లీట్ చేసుకొని రిలీజ్ చేయడానికి దర్శకుడు విష్ణువర్ధన్ ప్లాన్ చేస్తున్నారు. ఈ దర్శకుడు తెలుగులో పవన్ కళ్యాణ్ హీరోగా పంజా అనే మూవీ చేశారు.




# సంక్రాంతి స్టార్లు అంతా క్లీన్ గానే!




ఏడాది ముగింపులో రిలీజ్ అయిన యానిమల్...సలార్ చిత్రాలు భారీ అంచనాల మధ్య వచ్చినా? 18 ఏళ్ల లోపు యువకుల్ని మాత్రం నిరుత్సాహ పరిచిన సంగతి తెలిసిందే. పెద్దలకు మాత్రమే ఈ సినిమాలంటూ మార్కెట్ లో కి వచ్చాయి. భారీ వయోలెన్స్..హింస...కృరత్వం లాంటి అంశాలు ఆయా సినిమాలకు క్లీన్ సర్టిఫికెట్ లభించలేదు. సెన్సార్ ఇచ్చిన పట్టా ప్రకారం ఏ ట్యాగ్ తో రిలీజ్ అయ్యాయి. దీంతో 18 ఏళ్ల లోపు పిల్లలకు ఆ సినిమాలు థియేటర్లో దూరమయ్యాయి. అవి ఓటీటీలో కి అందుబాటులోకి వచ్చిన తర్వాత చూసుకోవడంతో తప్ప థియేటర్లో వెసులు బాటు లేకపోవడంతో కొంత నిరుత్సాహానికి గురయ్యారు. అయితే సంక్రాంతి రిలీజ్ లు మాత్రం దాదాపు క్లీన్ గానే ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే యువ హీరో తేజ సజ్జ నటించిన హనుమాన్ సెన్సార్ పూర్తిచేసుకున్న సంగతి తెలిసిందే. జనవరి 12న రిలీజ్ అవుతున్న ఈ సినిమాకి యూ ఏ సర్టిపికెట్ వచ్చింది. దీంతో ఈసినిమాకి సెన్సార్ నుంచి ఎలాంటి అడ్డంకులు లేవని తేలిపోయింది. ఎలాంటి కట్ లేకుండా రిలీజ్ అవుతుంది. ఇక విక్టర్ వెంకటేష్ తొలి పాన్ ఇండియా చిత్రం సైంధవ్ కూడా జనవరి 13 నరిలీజ్ అవుతుంది. ఈ సినిమాకి కూడా సెన్సార్ నుంచి యుఏ సర్టిఫికెట్ వచ్చింది. ఇక సూపర్ స్టార్ మహేష్ నటిస్తోన్న గుంటూరు కారం కూడా క్లీన్ గానే రిలీజ్ అవ్వడానికి ఛాన్స్ ఉంటుంది. త్రివిక్రమ్ సినిమాల్లో మరీ ఓవర్ గా హింస ఉండు. అసభ్యతకు అస్సలు ఛాన్సే ఉండదు. ఇంతవరకూ ఆయన సినిమాలకు ఏ సర్టిఫికెట్ వచ్చింది కూడా లేదు. దీంతో గుంటూరు కారం కూడా క్లీన్ గానే రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. ఇక మాస్ రాజా రవితేజ నటిస్తోన్న ఈగిల్ కూడా జనవరి 13న రిలీజ్ అవుతుంది. ఈ సినిమా కూడా ఎలాంటి కట్ లేకుండానే రిలీజ్ అవుతుందని అభిమానులు భావిస్తున్నారు. ఇక సంక్రాంతి కానుకగా నాగార్జున నటిస్తోన్న నా సామిరంగ రిలీజ్ అవుతుందా? లేదా? అని ఇంతసేపు సస్పెన్స్ కొనసాగింది. తాజాగా కొద్ది సేపటి క్రితమే క్లారిటీ వచ్చేసింది. జనవరి 14న సినిమా రిలీజ్ చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఇక ఈసినిమా కూడా సెన్సాన్ నుంచి క్లీన్ సర్టిఫికెట్ లభించే అవకాశం ఉంది. ఇలా సంక్రాంతి రిలీజ్ లన్నీ దాదాపు క్లీన్ గానే ఉండే అవకాశం ఉంది.

# బాక్సాఫీస్ తగలబడేలా.. ఎన్టీఆర్ హై వోల్టేజ్ లైనప్




యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటిస్తున్న 'దేవర' సినిమాపై ఎలాంటి హైప్ ఉందో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. ఆచార్య తో డిజాస్టర్ అందుకున్న కొరటాల శివ దేవర ప్రాజెక్ట్ ని చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. భారీ బడ్జెట్, భారీ కాస్టింగ్‌తో పాటూ బలమైన కథని ఈ సినిమా ద్వారా చెప్పబోతున్నాడు. ఈ సినిమా కోసం కెన్నీ బెట్స్ లాంటి హాలీవుడ్ టెక్నీషియన్స్ కూడా పనిచేస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ జాన్వి కపూర్ ఈ మూవీతో తెలుగు వెండితెరకి హీరోయిన్గా పరిచయం అవుతుంది. బాలీవుడ్ అగ్ర హీరో సైఫ్ అలీఖాన్ విలన్ గా నటిస్తున్నారు. సముద్రం బ్యాక్ డ్రాప్ లో రివేంజ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రూపొందుతోంది. కాగా ఈ సినిమాపై ఆడియన్స్ లో ఇండస్ట్రీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అంచనాలను మరింత పెంచుతూ సినిమా నిర్మాతల్లో కలిగిన కళ్యాణ్ రామ్ రీసెంట్ గా డెవిల్ ప్రమోషన్స్ లో దేవర గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. దేవర దాదాపు 80 శాతం షూటింగ్ పూర్తి చేసుకుందని, ప్రస్తుతం %ఎఖీశ% పనులు జరుగుతున్నాయని, త్వరలోనే గ్లింప్స్ ని రిలీజ్ చేయబోతున్నామని, ఇండియన్ సినిమా హిస్టరీలోనే ఇప్పటివరకు రాని ఓ భారీ విజువల్ ట్రీట్ ని దేవర తో ఆడియన్స్ కి పరిచయం చేయబోతున్నట్లు చెప్పారు. దీంతో ప్రస్తుతం దేవరపై హైట్ పిక్స్ చేరిపోయింది కాగా దేవర తర్వాత ఎన్టీఆర్ లైనప్ కూడా సాలిడ్ గా ఉండబోతోంది. దేవర సినిమాని రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు కొరటాల శివ. పార్ట్ వన్ వచ్చే ఏడాది ఏప్రిల్ లో గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సినిమా షూటింగ్ పూర్తయిన వెంటనే ఎన్టీఆర్ ఆలస్యం చేయకుండా బాలీవుడ్ బడా ప్రాజెక్టు 'వార్ 2' షూటింగ్లో జాయిన్ అవుతాడు. వీలైనంత త్వరగా 'వార్ 2' ను ముగించి ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో సినిమాని సెట్స్ పైకి తీసుకెళ్లాల్సి ఉంది. ఆ తర్వాత 'దేవర పార్ట్ 2' ఉంటుంది. ఈ ప్రాజెక్ట్స్ అన్ని భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా స్థాయిలో రూపొందనున్నాయి. ఇంత సాలిడ్ అండ్ లాంగ్ లైనప్ టాలీవుడ్ లో మరే స్టార్ హీరోకి లేదు. ఈ సినిమాలు కనుక సక్సెస్ అయితే ఎన్టీఆర్ క్రేజ్ పీక్స్ కు చేరడం గ్యారెంటీ అని చెప్పవచ్చు. ఇక ప్రస్తుతం ఫ్యామిలీతో వెకేషన్ వెళ్లిన తారక్ తిరిగి వచ్చిన వెంటనే దేవర మిగతా షూటింగ్ పూర్తిచేసి వెంటనే 'వార్ 2' సెట్స్ లో అడుగుపెట్టనున్నాడు

# న్యూస్ రీడర్ నుంచి హీరోయిన్ గా!

'కళ్యాణం కమనీయం'..'రుద్రుడు' లాంటి చిత్రాల్లో నటించిన ప్రియా భవానీ శంకర్ సుపరిచితమే. అమ్మడికి ఆ సినిమాలు పెద్దగా గుర్తింపును తేలేదు..గానీ ఓటీటీలో రిలీజ్ అయిన 'దూత'తో మాత్రం బాగా ఫేమస్ అయింది. నాగచైతన్య ప్రధాన పాత్రలో విక్రమ్.కె. కుమార్ తెరకెక్కించిన ఆ సిరీస్ మంచి విజయం సాధించడంతో ప్రియాకి మంచి గుర్తింపు దక్కింది. ప్రస్తుతం ఈ బ్యూటీకి అవకాశాలు బాగానే వరిస్తు న్నాయి. తమిళ్..తెలుగలో కొన్ని సినిమాలు చేస్తోంది. అయితే ఈ బ్యూటీకి పెద్దగా బ్యాక్ గ్రౌండ్ లేదు. కింద స్థాయి నుంచి ఎదిగిన హీరోయిన్ అని తెలుస్తోంది. చెన్నైకి చెందిన ప్రియా భవానీ శంకర్ అమ్మనాన్నల కోసం బీటెక్ పూర్తిచేసిన తర్వాత ఎంబీఏ కూడా చదివింది. ఉద్యోగం చేయాలని



ఇంట్లో వారి కోరిక. కానీ అమ్మడికి మాత్రం సినిమాలంటే పిచ్చి. కానీ ఎలా వెళ్లాలి అన్నది తెలియదు. వెనుకాల తెలిసిన వాళ్లు ఎవరూ లేరు . దీంతో తొలుత ఓ టీవీ ఛానెల్ లో న్యూస్ రీడర్ గా కెరీర్ ప్రారంభించింది. ఆ పరిచయాలతో సీరియళ్లకు ప్రమోట్ అయింది. అక్కడ బాగానే అవకాశాలు అందుకుంది. నటిగా నిరూపించుకునే ఓ వేదిక దొరక డంతో బుల్లి తెర నటిగా మంచి గుర్తింపును దక్కించుకుంది. అటుపై యాంకర్ గా..సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు దక్కించుకోవడం ఇలా జర్నీ కొంత కాలం సాగించింది. ఇక 2023 లో రిలీజ్ అయిన 'కళ్యాణం కమనీయం'..'రుద్రుడు' సినమాలతో తెలుగు తెరపై మెరిసింది. అటుపై చైతన్య నటించిన 'దూత'తో బాగా ఫేమస్ అయింది. ఇప్పుడు అవకాశాలు క్యూలో ఉన్నాయి. ఆ రకంగా అమ్మడు తన నటించాలన కోరికనను నెరవేర్చుకుంది. ఈ క్రమంలో చాలా సవాళ్లు ఎదుర్కొంది. అన్నింటిని దాటుకుని వచ్చింది కాబట్టే నిలబడగలిగింది. ప్రస్తుతం 'డిమోంటీ కాలనీ-2' లో నటిస్తోంది. ఈ హారర్ థ్రిల్లర్ మొదటి భాగం మంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే. అలాగే శంకర్ దర్శకత్వం వహిస్తోన్న 'ఇండియన్-2' లోనూ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ సినిమాతో ప్రియా పాన్ ఇండియాలో సక్సెస్ అవుతుందని చాలా ఆశలు పెట్టుకుంది.

# చీర కట్టిన మిస్ వరల్డ్

67వ మిస్ వరల్డ్ 2017 కిరీటం దక్కించుకున్న మానుషి చిల్లర్ హీరోయిన్ గా సామ్రాట్ పృథ్వీరాజ్ సినిమాతో బాలీవుడ్ లో అడుగు పెట్టిన విషయం తెల్సిందే. మొదటి సినిమాతో అక్కడ కమర్షియల్ విజయాన్ని సొంతం చేసుకోలేక పోయింది. అయినా కూడా ఈమెకు క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. మిస్ వరల్డ్ కిరీటం దక్కించుకున్న వెంటనే బాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ ఆమె వెంట పడ్డారు. కానీ ఆమె మాత్రం ఆచితూచి సినిమాలు ఎంపిక చేసుకుంటూ ఉంది. తాజాగా బాలీవుడ్ లో ఒకటి రెండు సినిమాలు చేస్తోన్న ఈ అమ్మడు బాలీవుడ్ లో భవిష్యత్తులో స్టార్ హీరోయిన్ గా నిలిచే అవకాశాలు ఉన్నాయి అంటున్నారు. ఇక సోషల్ మీడియా ద్వారా



మానుషి చిల్లర్ రెగ్యులర్ గా నెటిజన్స్ ని మరియు తన అభిమానులను ఎంటర్ టైన్ చేస్తూనే ఉంది. తాజాగా ఈ అమ్మడు చీర కట్టుకుని ఉన్న ఫోటోలను షేర్ చేసింది. గోవాలో ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మానుషి ఇలా సందడి చేసింది. బంగారు వర్ణపు చీర కట్టి చాలా అందంగా, బుట్ట బొమ్మగా కనిపిస్తున్న మానుషి చిల్లర్ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ సందడి చేస్తున్నాయి. ఈ రేంజ్ లో అందంగా కనిపిస్తున్న మానుషి చిల్లర్ ను భవిష్యత్తులో సౌత్ స్టార్ హీరోలకు జోడీగా చూస్తే బాగుంటుంది అనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు.




న్యాయ శిక్షాస్మృతుల్లో గణనీయమైన మార్పులతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొత్త చట్టాలను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా భారతీయ న్యాయ సంహిత చట్టంలో 'హిట్ అండ్ రన్' కేసులకు సంబంధించి తీసుకొచ్చిన కఠిన నిబంధన ట్రక్కు డ్రైవర్ల ఆగ్రహానికి కారణమయ్యింది. త్వరలో అమల్లోకి రానున్న ఈ చట్టానికి వ్యతిరేకంగా మూడు రోజులపాటు దేశవ్యాప్త నిరసనకు పిలుపునిచ్చారు. దీంతో దేశంలోని అనేక నగరాల్లో భారీ ట్రాఫిక్ జామ్‌లు, పెట్రోల్ బంకుల వద్ద క్యూలైన్లు, హింసాత్మక ఘటనలు, లాఠీఛార్జీలకు దారితీశాయి. ఈ నేపథ్యంలో డ్రైవర్లను ఆందోళనకు గురిచేస్తోన్న ఈ 'హిట్-అండ్-రన్' నిబంధనను ఓసారి పరిశీలిస్తే..

**చట్టం ఏం చెబుతోంది..? :** భారతీయ న్యాయ సంహిత ప్రకారం.. హిట్ అండ్ రన్, ర్యాష్ డ్రైవింగ్ అనేవి నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్ కిందకు వస్తాయి. ఇందులోని సెక్షన్ 104లో రెండు నిబంధనలు ఉన్నాయి. నిర్లక్ష్యంగా వాహనం నడిపి.. వ్యక్తి మరణానికి కారణమైతే గరిష్ఠంగా ఏడేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుంది. దీంతోపాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉందని మొదటి నిబంధనలో పేర్కొన్నారు. రెండో నిబంధనలో.. రోడ్డు ప్రమాదాలకు కారణమైన వాహన డ్రైవర్లు ఘటన గురించి పోలీసులకు లేదా మేజిస్ట్రేట్‌కు సమాచారం ఇవ్వాలి. అలా ఇవ్వకుండా అక్కడ నుంచి పారిపోతే గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.7లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం భారతీయ శిక్షాస్మృతిలో ఇవి సెక్షన్ 304ఏ కిందకు వస్తాయి. నిర్లక్ష్యంగా వాహనం నడిపి, ప్రమాదంలో ఎవరైనా చనిపోతే ఐపీసీలో గరిష్ఠంగా రెండేళ్ల వరకు మాత్రమే జైలు శిక్ష ఉంది.

**డ్రైవర్లు ఏమంటున్నారు..? :** 'హిట్ అండ్ రన్' కేసులో గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్ష, భారీ జరిమానాపైనే ట్రక్కులు, లారీలు, ప్రైవేటు బస్సు డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ జైలు శిక్ష పడితే పదేళ్లపాటు కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తుందని, తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన చెందుతున్నారు. ఆ స్థాయిలో (రూ.7లక్షల) జరిమానా చెల్లించడం కూడా సాధ్యం కాదని ఆందోళన చెందుతున్నారు. ఈ నిబంధన వల్ల కొత్త వారు ఈ వృత్తిని చేపట్టేందుకు ముందుకు రారని డ్రైవర్ల సంఘాలు పేర్కొంటున్నాయి. అందుకే శిక్షతోపాటు జరిమానా కూడా తగ్గించాలని డిమాండు చేస్తున్నాయి.

**ఆందోళన ఉద్ధృతం..** 'హిట్ అండ్ రన్' నిబంధనకు వ్యతిరేకంగా ట్రక్కు డ్రైవర్లు దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనలు ఉద్ధృతంగా మారుతున్నాయి. మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, బిహార్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హరియాణాలు రాస్తారోకోలు, భారీ ర్యాలీలతో అట్టుడుకుతున్నాయి. పెద్దసంఖ్యలో ట్రక్కులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పలు చోట్ల ఈ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులు రహదారులను దిగ్బంధించడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఇంధన ట్రక్కులు నిలిచిపోవడంతో చాలా నగరాల్లో పెట్రోల్ బంకులు మూతపడ్డాయి. మిగిలిన బంకుల వద్ద భారీ సంఖ్యలో వాహనదారులు క్యూ కట్టిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఇలా దేశవ్యాప్తంగా కొనసాగుతోన్న డ్రైవర్ల ఆందోళనల కారణంగా పెట్రోల్, డీజిల్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో పలు రాష్ట్రాల్లో పెట్రోల్ బంకులు ఖాళీ అవుతాయనే ఆందోళన నెలకొంది. ఈ ప్రభావం రోజువారీ ప్రయాణాలు, నిత్యావసర సరుకుల రవాణా, పాఠశాలలపైనా పడనున్నట్లు కనిపిస్తోంది.




లండన్: అక్రమ వలసలకు అడ్డుకట్ట వేసేందుకు బ్రిటన్ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. అక్రమంగా దేశంలోకి ప్రవేశించే వారి సంఖ్యను నియంత్రించడంలో తమ ప్రభుత్వం పురోగతి సాధించిందని తాజాగా బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ ప్రకటించారు. ఆ కేసుల్లో తగ్గుదల నమోదైందని తెలిపారు. శరణార్థిగా ఆశ్రయం కోరిన కేసులను పరిష్కరించి వాటి భారాన్ని తగ్గించినట్లు తెలిపారు. ఈ మేరకు హోం శాఖ విడుదల చేసిన గణాంకాలను ఉటంకించారు. చిన్న పడవల్లో ఇంగ్లిష్ ఛానల్‌ను దాటుతున్న వారి సంఖ్య గత సంవత్సరం 36 శాతం తగ్గినట్లు ఆ గణాంకాలు వెల్లడించాయి. దాదాపు ఐదేళ్లలో మొదటిసారి ఈ తగ్గుదల నమోదైందని పేర్కొన్నాయి. దీనిపై సునాక్ స్పందిస్తూ.. 'బ్రిటన్ ప్రజలపై అక్రమ వలసల భారానికి ముగింపు పలకాలని నేను నిశ్చయించుకున్నాను.

ఈ చర్యలతో ప్రజల పన్నుల సొమ్మును ఆదా చేస్తున్నాం. ఫలితంగా పౌరసేవలపై ఒత్తిడి తగ్గుతోంది' అని వెల్లడించారు. అలాగే ఈ ఏడాది బ్రిటన్ ఎన్నికలకు వెళ్లనున్న తరుణంలో అక్రమ వలసల అంశం ప్రభుత్వానికి కీలకంగా మారింది. బ్రిటన్‌లో ఆశ్రయం కోసం దరఖాస్తు చేసి పెండింగ్‌లో ఉన్న కేసులు ప్రభుత్వంపై ఆర్థికంగా ప్రభావం చూపుతున్నాయి. ఆశ్రయం కోరుకుంటున్న ప్రజలు హోటళ్లు, నిర్బంధ కేంద్రాల్లో ఉండటంతో వారి నిర్వహణ నిమిత్తం ప్రభుత్వంపై రోజుకు 10.2 మిలియన్ల డాలర్ల భారం పడుతోంది. ఈ కేసుల్ని వేగంగా పరిష్కరించడంతో సొమ్ము ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, ఈ ఏడాది బ్రిటన్‌కు భారీ సంఖ్యలో వలసలు వచ్చే అవకాశం ఉందని ఇమ్మిగ్రేషన్ సర్వీస్ యూనియన్‌కు చెందిన అధికారులు హెచ్చరించారు. ఈ తరుణంలో సునాక్ ప్రభుత్వం సాధించిన పురోగతి తాత్కాలికమేననే అంచనాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదిలా ఉండగా.. బ్రిటిష్ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందే భారతీయులతో సహా అంతర్జాతీయ విద్యార్థులకు వీసా కొత్త నిబంధనలు నేటి నుంచి అమల్లోకి వచ్చాయి.

ఇక నుంచి విద్యార్థి వీసాపై వారి కుటుంబ సభ్యులను తీసుకురావడం కుదరదు. 'సరిహద్దులను నియంత్రించడం, ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను రక్షించుకునే చర్యలు ఈ ఏడాది మొత్తం అమల్లో ఉంటాయి. ఇందులో భాగంగా విదేశాల నుంచి వచ్చే విద్యార్థులు వారి కుటుంబీకులను తీసుకురావడానికి నేటితో ముగింపు పడింది. దీని ద్వారా వేల సంఖ్యలో వలసలు తగ్గుతాయి. ఇలా దాదాపు మూడు లక్షల మందిని నిరోధించేందుకు వ్యూహాన్ని సిద్ధం చేసుకున్నాం' అని బ్రిటన్ హోంశాఖ మంత్రి జేమ్స్ క్లెవర్లీ వెల్లడించిన సంగతి తెలిసిందే.


## భారతీయ యువతకు ఇది మంచి సమయం: ప్రధాని మోదీ




తిరుచ్చిరాపల్లి: భారతీయ యువత తమ నైపుణ్యాలతో కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. చంద్రయాన్ వంటి ప్రయోగాలతో మన శాస్త్రవేత్తలు భారత్ సత్తాను ప్రపంచానికి చాటారని ప్రశంసించారు. తమిళనాడులోని తిరుచ్చిరాపల్లిలో ఉన్న భారతీదాసన్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో మోదీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. "యువత ధైర్యవంతమైన సరికొత్త ప్రపంచాన్ని సృష్టించాలనే నినాదంతో భారతీదాసన్ విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. ప్రస్తుతం దేశ యువత అదే పనిలో నిమగ్నమై ఉంది. యువత అంటేనే శక్తికి నిదర్శనం. నైపుణ్యంతో వేగంగా పనిచేయడం వారికున్న సామర్థ్యం. దేశాభివృద్ధిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు యువతకు ఇది మంచి సమయం.

మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా.. నైపుణ్యాలను పెంచుకుంటూ.. కొత్త విషయాలను నేర్చుకుంటూ ముందుకు సాగాలి" అని యువతకు మోదీ సూచించారు. 2014లో భారత్ నాలుగు వేల ఆవిష్కరణలకు పేటెంట్లు పొందితే.. ప్రస్తుతం ఆ సంఖ్య 50 వేలకు చేరిందని ప్రధాని తెలిపారు. చంద్రయాన్ వంటి ప్రయోగాలతో భారత శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని, మునుపెన్నడూ లేని విధంగా శాస్త్రవేత్తలు భారత ప్రతిభను ప్రపంచానికి చాటి చెబుతున్నారని ప్రశంసించారు. భారతీయ కళాకారులు, సంగీతకారులు ఎన్నో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ అవార్డులను గెలుచుకున్నారని తెలిపారు. అనంతరం ప్రధాని మోదీ తిరుచ్చిరాపల్లిలో రూ.20,140 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలను శంకుస్థాపన చేశారు. గత పదేళ్లలో విమానాశ్రయాలు, జాతీయ రహదారుల సంఖ్యను రెండింతలు చేసినట్లు మోదీ తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీపై మండిపడ్డ కిషన్ రెడ్డి..కాళేశ్వరం భవిష్యత్తు ఏంటీ?




తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఉన్న అవినీతి పట్ల అనేక సార్లు ప్రస్తావించిన నేతలు ఇప్పుడు పట్టించుకోవడం లేదని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షులు కిషన్ రెడ్డి జఅన్నారు. ప్రధానంగా రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్తు ఏంటని ప్రశ్నించారు. లక్షకోట్ల రూపాయల అవినీతి ప్రాజెక్టు విషయంలో ఎందుకు సీబీఐ విచారణకు కోరడం లేదని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ క్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టు లో భాగంగా నిర్మించిన మేడిగడ్డ కుంగిందన్నారు. అన్నారం ప్రాజెక్టు కూడా గ్యారెంటీ లేకుండా పోయిందన్నారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ ఈమేజ్‌ను గోదావరి పాలు చేసిందని ఎద్దేవా చేశారు. అంతేకాదు ఈ ప్రాజెక్టు గురించి మరింత విశ్లేషణ చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ ప్రాజెక్టు గురించి 20 అంశాలపైన నేషనల్ డ్యాం సెఫ్టీ అథారిటీ ప్రశ్నలు అడుగగా ప్రభుత్వం మారినా కూడా వివరాలు అందజేయలేదని గుర్తు చేశారు. 20 అంశాలలో 11 అంశాలకే అరకొర సమాధానాలు చెప్పారని వెల్లడించారు. ప్రస్తుత ముఖ్యముంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు మాట్లాడిన అంశాలు ఎందుకు అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి ప్రాజెక్టులు, స్కాంలపై దర్యాప్తు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు కోసం ఖర్చు పెట్టిన కోట్లాది రూపాయల గురించి ఎందుకు మరచిపోయారని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో అసలు కాళేశ్వరం ప్రాజెక్టులో నష్టపోయిన పిల్లర్స్ మళ్లీ కడతారా లేదా నేషనల్ డ్యాం సెఫ్టీ అథారిటీ సలహాలు తీసుకుంటారో చెప్పాలని కిషన్ రెడ్డి అన్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని న్యాయ విచారణ పేరుతో ఆలస్యం చేస్తోందన్నారు.

## సీఎండీ శ్రీధర్ బదిలీ.. సింగరేణి చరిత్రలోనే ఈయనదో రికార్డ్..



మంచిర్యాల: సింగరేణి సీఎండీ శ్రీధర్ బదిలీ అయ్యారు. శ్రీధర్ 2015 జనవరి 1 నుంచి సింగరేణి సీఎండీగా బాధ్యతలు చేపట్టారు. సింగరేణి చరిత్రలో 9 ఏళ్ల పాటు సుధీర్ఘంగా కొనసాగిన సీఎండీగా రికార్డు సాధించారు. శ్రీధర్ హయాంలో సింగరేణి అనేక విజయాలు సాధించడంతో పాటు వివాదాల్లోనూ చిక్కుకుంది. కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేసినా శ్రీధర్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించింది. శ్రీధర్ తీరుపై మొదటి నుంచి విపక్షాలు, కార్మిక సంఘాలు ఆగ్రహంతో ఉన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో శ్రీధర్ బదిలీ అయ్యారు. ఇన్‌చార్జి సీఎండీగా డైరెక్టర్ బలరాంకు బాధ్యతలు అప్పగించడం జరిగింది.

## మల్లన్న మూలవిరాట్ దర్శనం తాత్కాలికంగా నిలిపివేత



సిద్దిపేట జిల్లా, జనవరి 2: కొమురవెల్లి మల్లికార్జున స్వామివారి మూలవిరట్ దర్శనాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఆలయ ఈవో బాలాజీ శర్మ తెలిపారు.

ఉత్సవ విగ్రహాలతో భక్తులకు దర్శనం కల్పిస్తున్నట్లు చెప్పారు. జనవరి 7న స్వామివారి కల్యాణం సందర్భంగా మూలవిరట్‌కు రంగులు అద్ది సుందరీకరణలో భాగంగా నిజరూప దర్శనాన్ని నిలివేసినట్లు వివరించారు. జనవరి 7న దృష్టి కుంభం అనంతరం స్వామివారికి ఛత్రకన్ను అమర్చిన తర్వాత స్వామివారి మూలవిరాట్ దర్శనం కల్పిస్తామని ఆలయ ఈవో బాలాజీ శర్మ వెల్లడించారు.






## ఎమ్మెల్యే దానం తమ భూమి కబ్జా చేశారని ప్రజాభవన్ ముందు ఆందోళన

హైదరాబాద్ : ఎమ్మెల్యే దానం నాగేందర్ తమ ఇళ్ల స్థలాలు లాక్కొని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బాధితులు ప్రజాభవన్ ఎదుట ఆందోళనకు దిగారు. ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ బేగంపేట నుంచి వచ్చిన బాధితులు ఎమ్మెల్యే తమ భూమి కబ్జా చేశారని ఆరోపించారు. తమ ఇళ్ల స్థలాలు తమకే కావాలని నినాదాలు చేశారు. అయితే.. అదే సమయంలో ఆందోళనను వీడియో తీస్తున్న దానం నాగేందర్ అనుచరుడు నాగరాజు అనే వ్యక్తిని బాధితులు చితకబాది పోలీసులకు అప్పగించారు. దక్షిణమండలం డీసీపీ విజయ్‌కుమార్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు.




## తబ్లిగి జమాత్‌కు నిధులు కేటాయింపుపై హైకోర్టులో విచారణ



తబ్లిగి జమాత్‌కు నిధులు కేటాయింపుపై హైకోర్టులో విచారణ జరిగింది. వక్ఫ్ బోర్డు నిధులతో ప్రభుత్వానికి సంబంధం లేదనేది పిటిషనర్ వాదన. నిధులు విడుదల చేయాలని వక్ఫ్ బోర్డును ఆదేశించే హక్కు ప్రభుత్వానికి లేదని పిటిషనర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. నిధులు కేటాయిస్తూ చేస్తూ జారీ చేసిన జీఓను రద్దు చేయాలని కోరుతున్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు మైనారిటీ వెల్ఫేర్ కోసమేనని ప్రభుత్వం వాదిస్తోంది. తబ్లిగి జమాత్‌ను రష్యాతో పాటు మరి కొన్ని దేశాలు బ్యాన్ చేశాయని పిటిషనర్ తరుపు న్యాయవాది వాదనలు వినిపించారు. రష్యా వాళ్ళు భగవద్గీతను కూడా బ్యాన్ చేశారు కానీ మనం అనుసరిస్తున్నాం కదా అని హై కోర్టు ప్రశ్నించింది. 2020లో భైంసాలో ఇలానే సభ పెడితే ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయని పిటిషనర్ తరుపు న్యాయవాది పేర్కొన్నారు. డిసెంబర్ 13న రూ.2.45 కోట్లు నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ చేయడం జరిగింది. అయితే పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హై కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

## బీఆర్ఎస్ హయాంలో తెలంగాణను ఆర్థికంగా కొల్లగొట్టారు: పొంగులేటి



పాలేరు: ప్రజా సేవకులుగా ఉన్నాం.. ప్రజల కష్టాలు తీరుస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పాలేరు నియోజకవర్గంలో పలు ప్రజాపాలన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులతో మాట్లాడి ప్రజాపాలన కార్యక్రమం పై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం నడుస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఆరు గ్యారెంటీలు ఇస్తామని చెప్పామని ??కేబినెట్ మీటింగ్‌లో తొలి సంతకం ఆరు గ్యారెంటీలపైనే చేశామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే ఆరు గ్యారెంటీలకు సంబంధించిన రెండు అంశాలు ప్రారంభించామన్నారు. నిబద్ధతతో పనిచేసి ప్రతీ హామీని నెరువేరుస్తామన్నారు. ప్రజా సమస్యలు తీర్చేందుకే ఈ ప్రభుత్వం ఉందన్నారు. గత ప్రభుత్వంలో తెలంగాణను ఆర్థికంగా ఎంతో కొల్లగొట్టారు. తెలంగాణ రాష్ట్రం ఎంత అప్పుల్లో ఉందో ప్రతి పక్ష నాయకుల ముందే చర్చ పెట్టామన్నారు. అధికారం ఉంది కదా అని సంతకం పెట్టి అప్పులు చేసిన గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల సొమ్ముతో పెద్ద ఇల్లు కట్టాడని మంత్రి విమర్శించారు.

## అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ

హైదరాబాద్ : అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి పూజిత అక్షింతలను బీజేపీ నాయకులు, ప్రణవభక్త సమాజం సభ్యులు ఇంటింటికీ వెళ్లి అందజేశారు. వాటిని ఇంట్లో పెట్టి పూజలు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 22న అయోధ్యలో జరిగే పూజల సందర్భంగా అక్షింతలకు పూజలు చేసి తలపై వేసుకోవాలని సూచిస్తున్నారు. రాజేంద్రనగర్‌లో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు, నాయకులు ఇ.వేణుగోపాల్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు. హైదర్‌గూడలో బీజేపీ నాయకులు, ప్రణవభక్త సమాజం సభ్యులు ఇంటింటికీ దివ్య అక్షింతలను ప్రజలకు పంచిపెట్టారు. బీజేపీ నాయకులు సులిగె వెంకటేశ్, సనివెళ్లి నర్సింహ్మారెడ్డి, ప్రణవభక్త సమాజం సభ్యులు పాల్గొన్నారు.

**బహదూర్‌పురా:** శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ఆర్యాబాద్ బస్తీ ప్రముఖ్ ఉదయ్‌కిరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో అలియాబాద్‌లో శ్రీరాముడి అక్షింతల ఊరేగింపు నిర్వహించారు.

కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సద్భావన ప్రముఖ్ చార్మినార్ బాగ్ అలంపల్లి దశరథ్, చార్మినార్ బాగ్ ధర్మజాగరణ ప్రముఖ్ కొత్తకోట రామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

**చాంద్రాయణగుట్ట:** గౌలిపురాలో రామజన్మభూమి అక్షింతలు ఇంటింటికీ వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో డొంకి యాదగిరి, కౌడి సురేందర్, మోకాల వెంకటేశ్, డాక్టర్ విజయ్, మహేంద్ర గిరి, అడ్వకేట్ సారథి, రమేశ్, రాజు, రాజేశ్, సుధీర్ పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com